# తెలంగాణ ముచ్చట్లు


TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శుక్రవారం-17- అక్టోబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 140 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



## ధాన్యం సేకరణకు పటిష్ఠ చర్యలు

- రైతులకు భరోసా ఇచ్చిన మంత్రిమండలి
- రాష్ట్రంలో రికార్డు స్థాయి దిగుబడి అంచనా
- సన్నవడ్లకు రూ.500 బోనస్
- రైతుల ఖాతాల్లో నేరుగా జమ
- స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు నిర్ణయం
- ప్రజా పాలన,ప్రజా విజయోత్సవాలకు కేబినెట్ ఆమోదం

హైదరాబాద్,అక్టోబర్16(తెలంగాణ ముచ్చట్లు):

వర్షాకాలంలో రాష్ట్రం రికార్డు స్థాయిలో 1 కోటి 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించనున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది.

గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరే అవకాశం ఉందని పౌర సరఫరాల విభాగం అంచనా వేసింది. అందులో 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించగా,

మిగతా 2లో



## పోలీస్ ఫిర్యాదుల పరిష్కారానికి సరికొత్త వేదిక

- ఎస్పిసిఏ వెబ్‌సైట్, లోగో ఆవిష్కరణ
- పోలీస్ శాఖలో పారదర్శకతకు కొత్త వేదిక
- ప్రజల న్యాయబద్ధ ఫిర్యాదుల పరిష్కారానికి సహాయకం
- అంబేద్కర్ సచివాలయంలో ఘనంగా కార్యక్రమం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశం
- మంత్రి, ఉన్నతాధికారులు హాజరు
- ప్రజల నమ్మకాన్ని పెంపొందించే వెబ్‌సైట్ రూపకల్పన

2లో





## అమీర్‌పేట ముంపుకు హైడ్రా పరిష్కారం

- 10 సెంటీమీటర్ల వర్షం పడినా నీరు నిల్వలేదని నివేదిక
- నాలాల పూడిక తొలగింపుతో వరద భయం తగ్గింపు
- నగరంలోని ఇతర ముంపు ప్రాంతాల్లోనూ ఇదే విధానం అనుసరించాలని ఆదేశాలు
- 45 ట్రక్కుల మట్టి, చెత్త తొలగింపు
- హైడ్రా కమీషనర్ ఏ.వి. రంగనాథ్ పర్యవేక్షణ

హైదరాబాద్,అక్టోబర్16(తెలంగాణ ముచ్చట్లు):

నగరంలోని అమీర్‌పేటలో వర్షం అంటే భయం అన్న స్థితి ఈసారి మారింది. ప్రతి ఏటా కేవలం 10 సెంటీమీటర్ల వర్షం పడినా నడుం లోతు నీటిలో మునిగిపోయే అమీర్‌పేట ఈసారి ముంపు భయాన్ని అధిగమించింది. వర్షాకాలంలో ముంపు సమస్యను శాశ్వతంగా నివారించేందుకు హైడ్రా విస్తృత చర్యలు చేపట్టింది. హైడ్రా కమీషనర్ ఏ.వి. రంగనాథ్ పర్యవేక్షణలో నాలాల డీసిల్టింగ్, పైపులైన్ల పునరుద్ధరణ,

మిగతా 2లో



## సదర్ సమ్మేళనానికి సిఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం



హైదరాబాద్,అక్టోబర్16 (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్‌లో జరగనున్న శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ ఆహ్వానించింది. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో కమిటీ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ నెల 19న ఎన్టీఆర్ స్టేడియంలో జరగనున్న సదర్ సమ్మేళన్‌లో పాల్గొనాలని కోరారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌తో పాటు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



## కేసీఆర్ పాలనలో వాగ్దానాలు ఆవిరి, ప్రజల ఆశలు చిద్రం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మపురి,అక్టోబర్ 16(తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, ఇప్పుడు 'బాకీ కార్డు' పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులను బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. "ప్రజల బాకీలు తీర్చకుండా, ఇప్పుడు మోసపోయినట్లు నటించడం హాస్యాస్పదం.

మిగతా 2లో

## రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటండి

మంత్రి ధనసరి అనసూయ సీతక్క

వెంకటాపూర్, అక్టోబర్16, (తెలంగాణ ముచ్చట్లు):

యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా 2021లో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ ఖ్యాతిని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క గురువారం పిలుపునిచ్చారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, తెలంగాణ టూరిజం, ప్రభుత్వ సహకారంతో గత తొమ్మిది రోజులుగా పాలంపేటలో జరుగుతున్న వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ శిక్షణా శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులు, వాలంటీర్లను మంత్రి సీతక్క హరిత కాటేజ్‌లో సందర్శించారు.

మిగతా 2లో






## కేబినెట్ మీటింగ్‌కు దూరంగా నిలిచిన కొండా సురేఖ

- కారణాలపై రాజకీయ వర్గాల్లో చర్చ
- మంత్రివర్గ సమావేశానికి గైర్హాజరు అయిన సురేఖ
- కాంగ్రెస్‌లో అంతర్గత ఉద్రిక్తతలేనా?
- రేవంత్ కేబినెట్‌లో ఖాళీ కుర్చీ
- సురేఖ దూరం కొత్త రాజకీయ సంకేతమా?

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ సచివాలయంలో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనేక కీలక అంశాలపై చర్చకు వేదికైంది. బీసీ రిజర్వేషన్ల అమలు, ఎస్ఎల్‌బీసీ పనుల ప్రారంభం, కాళేశ్వరం రీడిజైన్ ప్రాజెక్టు,

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు

(మొదటి పేజీ తరువాయి)



మరో 15-20 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయాలని, ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు రూ.500 బోనస్ నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది.

రాష్ట్రంలో కొత్తగా హుజూర్‌నగర్, కొడంగల్, నిజామాబాద్‌లో మూడు వ్యవసాయ కళాశాలలు స్థాపించడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 1 నుంచి 9 వరకు "ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు" నిర్వహించాలని, అవసరమైన ఏర్పాట్ల కోసం కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ సంతానం కలిగిన వారు పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనపై చర్చించిన మంత్రివర్గం, ఆ నిబంధనను కొనసాగించాల్సిన అవసరం లేదని నిర్ణయించి దాన్ని రద్దు చేయాలని అంగీకరించింది.అదనంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడలోని ఏన్కూర్ మార్కెట్ యార్డ్‌కు 10 ఎకరాలు, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయానికి అదనంగా 7 ఎకరాల భూమిని కేటాయించాలని నిర్ణయించింది. నల్సార్ అడ్మిషన్లలో తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతం పెంచాలని కూడా తీర్మానించింది.

హైదరాబాద్ మెట్రో 2A, 2B విస్తరణ ప్రాజెక్టులపై మంత్రివర్గం విస్తృత చర్చ జరిపింది. ఎల్ అండ్ టీ నిర్వహిస్తున్న మొదటి దశ ప్రాజెక్టును పీపీపీ మోడ్‌లో నుంచి స్వాధీనం చేసుకునే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీ నివేదికను మంత్రివర్గ ఉప సంఘం సమగ్రంగా పరిశీలించనుంది.

రాష్ట్రంలో హ్యామ్ మోడ్‌లో మొదటి దశలో 5,566 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్యారడైజ్ జంక్షన్-శామీర్‌పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్-డెయిరీ ఫాం రోడ్ వరకు ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి అవసరమైన రక్షణ శాఖ భూములకు ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాలు కేటాయించాలని తీర్మానించింది.కృష్ణా,వికారాబాద్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గం కోసం 845 హెక్టార్ల భూసేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. మన్ననూర్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు వ్యయంలో మూడో వంతు రాష్ట్రం భరించాలని నిర్ణయించింది.

మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరి మీడియా సమావేశంలో వివరించారు.



## పోలీస్ ఫిర్యాదుల పరిష్కారానికి సరికొత్త వేదిక

హైదరాబాద్,అక్టోబర్16(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లెయింట్ అథారిటీ (ఎస్పిసిఏ) ప్రత్యేక వెబ్‌సైట్, లోగోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.పోలీస్ శాఖలో పారదర్శకత, ప్రజల న్యాయబద్ధ ఫిర్యాదుల పరిష్కారానికి ఈ వేదిక దోహదం చేస్తుందని సీఎం తెలిపారు.గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్, సీజీజీ డీజీ రవి గుప్త, ఎస్పీసీఏ చైర్మన్ జస్టిస్ బి. శివశంకర్ రావుతో పాటు అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు పోలీస్ వ్యవస్థపై నమ్మకంతో ఫిర్యాదులు చేయడానికి వీలుగా ఈ వెబ్‌సైట్ రూపకల్పన చేయబడిందని అధికారులు తెలిపారు.



## అమీర్‌పేట ముంపుకు హైడ్రా పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

చెత్త తొలగింపు వంటి పనులు పూర్తిచేయడంతో ఈ ఫలితం సాధ్యమైంది.అమీర్‌పేట, గాయత్రీ హిల్స్, మదురానగర్, శ్రీనివాస్‌నగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు అమీర్‌పేట ప్రధాన రహదారిపై నిలిచిపోయేది. ఈసారి ఆ సమస్యను హైడ్రా పరిష్కరించింది. కమీషనర్ ఏ.వి. రంగనాథ్ నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో పనులు వేగవంతం చేశారు.

అమీర్‌పేటలో పూడుకుపోయిన నాలాలనుంచి మట్టి, చెత్త తొలగింపుతో 6 పైపులైన్లలో 3 లైన్ల పునరుద్ధరణ పూర్తయింది. మిగతా 3 లైన్లలో పూడిక తొలగింపును త్వరితగతిన ముగించాలని కమీషనర్ ఆదేశించారు. ఇప్పటివరకు 45 ట్రక్కుల మట్టి, చెత్త తొలగించడంతో వర్షపు నీరు సులభంగా ప్రవహిస్తోంది.

అమీర్‌పేట మోడల్ నగరంలోని ఇతర ముంపు ప్రాంతాలకు కూడా మార్గదర్శకంగా ఉండాలని కమీషనర్ ఏ.వి. రంగనాథ్ తెలిపారు. ఇదే విధానం అనుసరిస్తే వర్షాకాలంలో నగర ముంపు సమస్యను పూర్తిగా నివారించవచ్చని అన్నారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు హైడ్రా బృందం చేపట్టిన పనులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేబినెట్ మీటింగ్‌కు దూరంగా నిలిచిన కొండా సురేఖ

(మొదటి పేజీ తరువాయి)



అభివృద్ధి పథకాలపై వేగవంతమైన నిర్ణయాలు చేపట్టే దిశగా ఈ సమావేశం జరిగింది. అయితే ఈ కీలక సమావేశానికి ఒక్క మంత్రి కొండా సురేఖ మాత్రమే గైర్హాజరుకావడం ప్రత్యేక దృష్టిని ఆకర్షించింది. సమావేశానికి ముందు కొండా సురేఖ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను, అనంతరం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిసి మాట్లాడటం అర్థాలనిస్తోంది. పార్టీ అధిష్ఠానంతో చర్చలు జరిపిన వెంటనే కేబినెట్ మీటింగ్‌కు హాజరుకాకపోవడం ఆమె వైఖరిపై వివిధ రకాల ఊహాగానాలకు దారితీసింది. ఇది కేవలం వ్యక్తిగత కారణమా, లేదా పార్టీ విధానాలపై అసంతృప్తికి సంకేతమా అన్న ప్రశ్న చర్చనీయాంశమైంది. ఇటీవలి కాలంలో కొండా సురేఖ చుట్టూ వివాదాలు తగ్గడం లేదు. ఆమెకు ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ప్రభుత్వం సిమెంట్ కంపెనీలను బెదిరించిన ఆరోపణలతో తొలగించడం పెద్ద వార్తగా మారింది. ఆ ఘటనతో ఆమె రాజకీయ ఇమేజ్‌పై విమర్శలు వచ్చాయి. దానికితోడు మేడారం జాతర ఏర్పాట్ల విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో విభేదాలు బహిర్గతమయ్యాయి. ఈ పరిణామాల సమాహారంగా ఆమె ప్రతి అడుగు ఇప్పుడు ప్రత్యేకంగా గమనించబడుతోంది.

సురేఖ పార్టీకి దూరమవుతున్నారా? లేక అంతర్గతంగా ఏదైనా చర్చలు కొనసాగుతున్నాయా అనే ప్రశ్నలపై ప్రభుత్వ వర్గాలు మౌనం పాటిస్తున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి మహేశ్ కుమార్ గౌడ్ ఆమెతో మాట్లాడతానని చెప్పిన వ్యాఖ్యలు మరో కోణాన్ని తెర మీదకు తీసుకువస్తున్నాయి. కమ్యూనికేషన్ గ్యాప్ మాత్రమేనని వ్యాఖ్యానించినప్పటికీ, ఆమె గైర్హాజరు రాజకీయ సందేశాలుగా పరిగణించబడుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో బీసీ రిజర్వేషన్ల చర్చ వేడెక్కుతున్న వేళ, కొండా సురేఖ వంటి ప్రముఖ నేతల వైఖరి కాంగ్రెస్‌కు వ్యూహాత్మకంగా కీలకం. ఆమె హాజరు లేకపోవడం తాత్కాలిక పరిణామమా, లేక లోతైన అసంతృప్తి సంకేతమా అన్నది రాబోయే రోజులలో స్పష్టం కానుంది.

## కేసీఆర్ పాలనలో వాగ్దానాలు ఆవిరి, ప్రజల ఆశలు చిద్రం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలే ఓట్ల రూపంలో తీర్పు ఇచ్చారు," అని ఆయన అన్నారు.

మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ ఖజానా పార్టీ ప్రచారానికి మాత్రమే వినియోగించబడిందని, ప్రజల పన్ను డబ్బు పార్టీ నడపడానికి దుర్వినియోగమైందని ఆరోపించారు. దీనికి విరుద్ధంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రుణాల మడుగు నుంచి అభివృద్ధి దిశగా నడిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. "ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, 20 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను దశలవారీగా అమలు చేస్తోంది. ప్రజల విశ్వాసమే మా బలం," అని ఆయన ఉద్ఘాటించారు.



ధర్మపురి అభివృద్ధిలో కొత్త ఊపు

ధర్మపురి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయని మంత్రి వెల్లడించారు. డిగ్రీ కళాశాల కోసం జీఓ త్వరలో వస్తుందని, గోదావరి ప్రాంతంలో రూ.17 కోట్లతో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. రోళ్లవాగు ప్రాజెక్టు పనులు సమన్వయ లోపంతో నిలిచిపోయినప్పటికీ, త్వరలో సమీక్ష జరపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదనంగా, బస్ డిపో, పాలిటెక్నిక్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ కళాశాల భూమిపూజలు త్వరలో ప్రారంభమవుతాయని, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్, లిఫ్ట్ బిల్లులను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరిష్కరిస్తోందని ఆయన వివరించారు.

**2027 గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు**

2027 గోదావరి పుష్కరాలను తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. అన్ని పార్టీలు, ప్రజా ప్రతినిధుల సూచనలను స్వాగతిస్తూ పుష్కరాల అభివృద్ధి పనులు సాగుతాయని ఆయన హామీ ఇచ్చారు.

**"ప్రజలే బాకీ వసూలుదార్లు"**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బీఆర్ఎస్ నేతలపై మరోసారి విమర్శలు గుప్పించారు. "2028 ఎన్నికల్లో ప్రజల ఓటే తీర్పుగా మారుతుంది. కేసీఆర్ పాలనలో వాగ్దానాలు ఆవిరైపోయాయి, ప్రజల ఆశలు చిద్రమయ్యాయి. పదేళ్ల మోసానికి సమాధానం ప్రజల ఓట్లతోనే వస్తుంది," అని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కట్టుబడి ఉందని, ధర్మపురి అభివృద్ధితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటండి

(మొదటి పేజీ తరువాయి)



వాలంటీర్లతో ముఖాముఖి సంప్రదించిన మంత్రి సీతక్క, వారి అనుభవాలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. "కాకతీయుల చరిత్ర, సాంస్కృతిక, ఆర్కిటెక్చరల్ వారసత్వాన్ని మీరు ఇక్కడ నేర్చుకుంటున్నారు. ఈ జ్ఞానాన్ని మీ ప్రదేశాల్లో చేరాక కూడా వేరే ప్రాంతాల ప్రజలకు, విద్యార్థులకు తెలియజేయాలి. రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేయడానికి మీ భూమిక ముఖ్యమైనది. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందిన ఈ ఆలయాన్ని మరింత ప్రపంచవ్యాప్తంగా చాటాలి," అని ఆయన తెలిపారు. ఈ శిక్షణ ద్వారా యువతకు కాకతీయ కళా సంపద, వారసత్వ రక్షణపై అవగాహన పెరిగి, పర్యాటక రంగంలో అవకాశాలు సృష్టించాలని మంత్రి సూచించారు.

**నాలుగోసారి రామప్పలో వరల్డ్ హెరిటేజ్ క్యాంప్**

కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ, ఇది రామప్పలో నిర్వహిస్తున్న నాలుగో వరల్డ్ హెరిటేజ్ క్యాంప్ అని, ప్రతి సంవత్సరం వివిధ దేశాల విద్యార్థులు పాల్గొంటూ కాకతీయుల కళా సంపద, వారసత్వాన్ని ఎలా కాపాడాలో, వాటి ప్రాముఖ్యతను తెలుసుకుంటున్నారని వివరించారు. "కాకతీయ రుద్రేశ్వర (రామప్ప) ఆలయం 2021 జూలై 25న యునెస్కో వరల్డ్ హెరిటేజ్ లిస్ట్‌లో చేర్చబడింది. ఇది కాకతీయుల సృజనాత్మకత, కళాత్మకత, ఇంజనీరింగ్ ప్రతిభకు అద్భుతమైన సాక్ష్యం. ఈ క్యాంప్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా దీని ఖ్యాతిని వ్యాప్తి చేయడానికి కృషి చేస్తున్నాం," అని ఆయన పేర్కొన్నారు.

**మేడారం ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా మార్చాలి**

అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ మాట్లాడుతూ, "మంత్రి సీతక్క పర్యాటక రంగ అభివృద్ధికి, మేడారం ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. యువత, ప్రజలకు పర్యాటకం దోహదపడే విధానం మీద శిక్షణ ఇస్తున్నాం. రామప్ప చుట్టూ రామప్ప చెరువు, చిన్న ఆలయాలు, అడవులు, వ్యవసాయ భూముల మధ్య ఉన్న ఈ సైట్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నాం," అన్నారు.

**విద్వాంసుల సూచనలు, యువత ప్రోత్సాహం**

ఈ శిక్షణలో ప్రొఫెసర్ వెంకట్ రెడ్డి (ఎన్ఐటి) జ్యోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్)పై, వైఎల్ శ్రీనివాస్ (సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ) టూరిజం, కల్చర్, హెరిటేజ్ పై ముఖ్యమైన సూచనలు ఇచ్చారు. డాక్టర్ జి. మహేష్ తెలంగాణ హెరిటేజ్ అంశాలను వివరిస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, వాలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు. రామప్ప ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ప్రచుర్యం పెంచడం, ప్రాంతీయ యువతను పర్యాటక, వారసత్వ రక్షణలో ప్రోత్సహించడం ఈ క్యాంప్ లక్ష్యంగా నిలిచింది. మంత్రి సీతక్క సందర్శన ద్వారా వాలంటీర్లలో మరింత ఉత్సాహం పెరిగింది. ఈ కార్యక్రమం తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త ఊపిరి పోస్తుందని, రామప్ప ఆలయాన్ని ప్రపంచ కేంద్రంగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆశాభావం వ్యక్తమైంది.

## బీసీ బంద్‌కు కాంగ్రెస్ మద్దతు

◆ కొండా సురేఖపై మాట్లాడతానన్న మహేశ్ కుమార్ గౌడ్



అక్టోబర్ 18న బీసీ సంఘాలు చేపట్టిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గాంధీ భవన్‌లో బీసీ సంఘాల నేతలతో సమావేశమై స్పందించారు. బీసీ రిజర్వేషన్లపై తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేదిలేదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో కుల సర్వేలకు ఆద్యుడు రాహుల్ గాంధీనే అని పేర్కొంటూ, ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ అమలుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. అసెంబ్లీలో బీసీ బిల్లును మద్దతు చేసిన బీజేపీ బయట మాత్రం అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ఈ బంద్ ద్వారా కేంద్రానికి సందేశం వెళ్లాలని రాష్ట్రంలోని ప్రతి బీసీ ఈ నిరసనకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. మంత్రి కొండా సురేఖ అంశంపై ఆయన స్పందిస్తూ, ఆమెతో స్వయంగా మాట్లాడతానని, ఇది కేవలం కమ్యూనికేషన్ లోపం మాత్రమేనని, సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని అభిప్రాయపడ్డారు బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ తీసుకున్న ఈ ధోరణి, రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి బీసీ వర్గాల ప్రాధాన్యతను స్పష్టంగా చూపిస్తోంది. బీసీ ఓటు బ్యాంకుపై దృష్టి పెట్టిన కాంగ్రెస్, రాహుల్ గాంధీ కుల సర్వే నినాదాన్ని తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ ముందుకు తెచ్చే యత్నం చేస్తోంది. బంద్‌కు బహిరంగ మద్దతు ప్రకటించడం ద్వారా బీసీ సంఘాల భావోద్వేగాలకు దగ్గరయ్యే ప్రయత్నం కనిపిస్తోంది.


మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్‌పై మహేశ్ కుమార్ గౌడ్ చేసిన విమర్శలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అసెంబ్లీలో మద్దతు పలికి బయట స్టాండ్ మారడం ద్వంద్వ వైఖరేనని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. రిజర్వేషన్ల అంశంపై న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించడం ద్వారా బీసీ వర్గాలతో పోరాటయజ్ఞంలో తాము ముందుండబోతున్నామని సంకేతం ఇస్తోంది. కొండా సురేఖ వ్యాఖ్యలపై స్పందించిన తీరు కూడా గమనించదగ్గది. నేరుగా విరోధంలోకి కాకుండా మాట్లాడి సమస్యను పరిష్కరించాలనే సంకేతం ఇస్తూ, పార్టీ అంతర్గత విభేదాలను నియంత్రించే ప్రయత్నం మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యల్లో కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం పెరగకుండా, బీసీ అజెండాను ముందుకు తీసుకెళ్లే దిశగా ఈ ప్రయత్నం సాగుతున్నట్టుగా అర్థమవుతోంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
శుక్రవారం-17- అక్టోబర్ 2025




## విద్యార్థులకు 108 అంబులెన్స్ ద్వారా సిపీఆర్ పై అవగాహన

**పెద్దమందడి,అక్టోబర్16(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడిలోని జీవీకే ఈఎంఆర్ఐ 108 అంబులెన్స్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గుండె పనిచేయకపోవడంలో తక్షణ సహాయం (సిపీఆర్) పై అవగాహన శిక్షణ నిర్వహించారు.ఈ శిక్షణలో గుండెపోటు వచ్చినప్పుడు లేదా గుండె పనితీరు ఆగిన సందర్భాల్లో తక్షణ సహాయం ఎలా అందించాలో విద్యార్థులకు వివరించారు. ఎమర్జెన్సీ వైద్య సిబ్బంది గుండెపోటు మరియు గుండె ఆగిపోవడంలో తక్షణ సహాయ పద్ధతుల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రాక్టికల్ డెమో ద్వారా చూపించారు.ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే పద్ధతులు గురించి అవగాహన పెంచుకున్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, 108 సిబ్బంది భాస్కర్, యోగేశ్వర్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయ శాంతన్న, 108 వనపర్తి జిల్లా మేనేజర్ మెహబూబ్ పాల్గొన్నారు.



## నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న డా. జిల్లెల ఆదిత్య రెడ్డి

**వనపర్తి,అక్టోబర్16(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ జిల్లెలగూడలోని మహీంద్రా ఎలైట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జె.వి. రమణ కుమారుడి నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఏఐపీసీ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ నేషనల్ హెడ్ డా. జిల్లెల ఆదిత్య రెడ్డి వధూవరులకు ఆశీర్వచనాలు అందిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

డా. ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ.. "వివాహ బంధం జీవితం లో అత్యంత పవిత్రమైన అనుబంధం. కొత్త జీవితానికి ఆరంభం అవుతున్న ఈ సందర్భంలో ఇద్దరికీ సుఖసంతోషాలతో నిండిన జీవితం కలగాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు.



## కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఆరోగ్య శిబిరం విజయవంతం

**ఏ.ఎస్.రావు నగర్, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన ఆరోగ్య శిబిరం విజయవంతంగా ముగిసింది. పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. శిబిరంలో రక్త పరీక్షలు, నేత్ర పరీక్షలు, దంత పరీక్షలు, హృదయ సంబంధిత పరీక్షలు నిర్వహించబడ్డాయి. రక్త పరీక్షలలో చక్కెర స్థాయి, కొలెస్ట్రాల్, రక్తస్రావం వంటి ముఖ్య అంశాలు పరిశీలించగా, నేత్ర పరీక్షల ద్వారా దృష్టి సమస్యలు, గ్లూకోమ్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. దంత పరీక్షలలో వ్యక్తిగత దంత ఆరోగ్యం పై సూచనలు ఇచ్చారు. హృదయ పరీక్షల ద్వారా రక్తపోటు, హృదయ దాడి సూచికలు పరిశీలించారు.ఈ శిబిరాన్ని తులసి లైఫ్ లైన్ ఆసుపత్రి, పోలీస్ ఆసుపత్రి, ఎస్‌బీఐ లైఫ్ సంయుక్తంగా నిర్వహించాయి. వైద్యులు పోలీస్ సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ఆహార నియమాలు, వ్యాయామం ప్రాముఖ్యత, తాగునీటి పరిమాణం వంటి ఆరోగ్య చిట్కాలను వివరించారు. ఇందువల్ల పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్య పరిస్థితిని సమీక్షించుకునే అవకాశం పొందారు. భవిష్యత్తులో రోగాల నిర్లక్ష్యాన్ని నివారించేందుకు అవగాహన పెరిగింది.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, సునిల్ రెడ్డి, సాయిలు, సతీష్, విజయ్, డాక్టర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సెవెన్ హిల్స్ కాలనీలో కమాన్ శంకుస్థాపన

### కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ డివిజన్ పరిధిలోని సెవెన్ హిల్స్ కాలనీలో కమాన్ (ముఖ ద్వారం) నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భూమి పూజను వైభవంగా నిర్వహించారు.కాలనీ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కాలనీ ముఖధ్వారం నిర్మాణానికి సహకరిస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ గుప్తా, మధుకర్ రెడ్డి, విజేందర్ రెడ్డి, సల్లా ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్, రామ్ రెడ్డి, లక్ష్మణ చారి, బాలేశ్వరయ్య, రామయ్య, సోమిరెడ్డి నారాయణ, సత్తయ్య, ఎల్లయ్య, మల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా యువ నాయకుడు ఇల్లందుల విజయ్ జన్మదిన వేడుకలు





**స్టేషన్ ఘనపూర్, అక్టోబర్16(తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇల్లందుల విజయ్ జన్మదిన వేడుకలు గురువారం అత్యంత ఉత్సాహంగా వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విజయ్ మాజీ ఉపముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. వేడుకల్లో భాగంగా కేక్ కట్టింగ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కడియం శ్రీహరి విజయ్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, వారి రాజకీయ, సామాజిక సేవలకు ప్రశంసలు అందించారు. యూత్ కాంగ్రెస్ నాయకుడిగా విజయ్ చేస్తున్న కృషి నియోజకవర్గంలో యువతకు స్ఫూర్తిగా నిలుస్తోందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సభ్యులు, స్థానిక నాయకులు, మరియు విజయ్ సన్నిహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను మరింత విజయవంతం చేశారు. ఇల్లందుల విజయ్ తన జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ద్వారా సమాజ సేవకు మరింత అంకితమవుతామని, యువత సమస్యల పరిష్కారంలో భాగస్వామ్యం అవుతామని హామీ ఇచ్చారు.

# మండల స్థాయి క్రీడల్లో రెండో రోజు హోరా హోరీ..

- అండర్ 14 కోకో బాలుర విభాగంలో ద్వితీయ బహుమతిని దక్కించుకున్న శ్రీ గ్లోబల్ హై స్కూల్
- అండర్ 17 వాలీబాల్ బాలు విభాగంలో ద్వితీయ బహుమతిని దక్కించుకున్న శ్రీ గ్లోబల్ హై స్కూల్.



**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 16, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండల స్థాయి పాఠశాల క్రీడలు రెండో రోజు బాలుర పోటీలు హోరాహోరీగా జరిగాయి. తెరిసా పాఠశాలలో జరిగిన ఈ పోటీలకు ముఖ్య అతిథిగా చింతకాని మండల ఎంపిడిఓ శ్రీనివాసరావు విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. చింతకాని ఎంఈఓ ఎస్ రామారావు పర్యవేక్షణలో క్రీడలు విజయవంతంగా ముగిసాయి. ఈ క్రీడలకు కన్వీనర్ స్టీఫెన్ బ్రదర్ ,ప్రిన్సిపల్ సంతోష్ తమ యొక్క సహాయ సహకారాలు అందించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుండి 350 మంది క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. రెండో రోజు జరిగిన క్రీడల్లో విజేతలు బాలుర 17 కబడ్డీ జడ్పిహెచ్ఎస్ కోడుమూరు, జెడ్పిహెచ్ఎస్ పొద్దుటూరు. బాలుర అండర్ 14 కబడ్డీ జడ్పీహెచ్ఎస్ చింతకాని, జిహెచ్ఎస్ నాగులవంచ.కోకో అండర్ 17 జడ్పీహెచ్ఎస్ కోడుమూరు, జడ్.పి.హెచ్.ఎస్ లచ్చగూడెం. కోకో అండర్ 14 జెడ్పిహెచ్ఎస్ కోడుమూరు శ్రీ గ్లోబల్ హై స్కూల్ నాగులవంచ. వాలీబాల్ అండర్ 17 జడ్పిహెచ్ఎస్ కోడుమూరు, శ్రీ గ్లోబల్ హై స్కూల్ నాగులవంచ. అండర్ 14 వాలీబాల్ జడ్పీహెచ్ఎస్ రామకృష్ణాపురం, జడ్పిహెచ్ఎస్ పొద్దుటూరు. ఈ యొక్క క్రీడల్లో మండల సెక్రెటరీ సిహెచ్ కృష్ణయ్య సీనియర్ పిడీలు పూనాటి వెంకటేశ్వర్లు, జి ,సైదేశ్వరరావు ,వి. కృష్ణారావు ,జి .నాగేశ్వరరావు, జి .వెంకటేశ్వర్లు ,సుధాకర్ ,గోపి మరియు ఇతర ఇతర స్కూల్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ మండల స్థాయి పోటీల్లో వాలీబాల్ విభాగంలో కోకో విభాగంలో ద్వితీయ బహుమతులు సాధించినటువంటి శ్రీ గ్లోబల్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులను కరస్పాండెంట్ ఇనుకుల దివాకర్ రెడ్డి అభినందించడం జరిగింది.

# స్లాట్ బుకింగ్ పద్దతుల్లో పత్తి కొనుగోళ్లు...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -16, తెలంగాణ ముచ్చట్లు:** పత్తి రైతులకు దళారుల సమస్యలు లేకుండా ఇక నుంచి నేరుగా స్లాట్ బుకింగ్ పద్ధతిలో పత్తి పంటను విక్రయించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్ ను ప్రవేశ పెట్టిందని, ఈ యాప్ ను రైతులు స్మార్ట్ ఫోన్ లో డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా సమీపంలోని ఏ జిన్నింగ్ మిల్లులో పత్తి విక్రయించాలనుకుంటే ఆ రోజు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని, ఈ యాప్ వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. కపాస్ కిసాన్ యాప్ ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని అన్నారు. ఆధార్ సంఖ్యను జత పరిచిన మొబైల్ నెంబర్ ను నమోదు చేసి స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని అన్నారు. పత్తి నాణ్యత ప్రమాణాలు ఉంటే (8 నుంచి 12 శాతం తేమ) ఉంటే స్లాట్ బుకింగ్ రోజుకు కొనుగోలు కేంద్రాలకి తీసుకుని వెళ్లాలని, 12 శాతం మించి తేమ ఉంటే సిసిఐ వారు కొనుగోలు చేయరని అన్నారు.

8 శాతం తేమ శాతం ఉంటే రూ. 8110/, 12 శాతం ఉంటే రూ. 7786/ మద్దతు ధర లభిస్తుందని, స్లాట్ బుక్ చేసుకున్న రోజు వెళ్లలేని పక్షంలో అట్టి స్లాట్ ను 24 గంటల ముందు రద్దు చేసుకోవాలని, ఒక రైతు మూడుసార్లు వరకు మాత్రమే స్లాట్ రద్దు చేసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సత్తుపల్లిలో గంజాయి ముఠా అరెస్ట్..

- 320 గ్రాముల గంజాయి స్వాధీనం.
- పోలీసుల ఉచ్చులో ఆరుగురు.

**సత్తుపల్లి, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** గంజాయి కొనుగోలు, విక్రయం, వినియోగం చేసిన ఆరుగురిని సత్తుపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రేజర్ల గ్రామానికి చెందిన జుంజునూరి సింహాద్రి అలియాస్ సందీప్, తుంబూరు గ్రామానికి చెందిన కారుమంచి రంజిత్ అలియాస్ రాఖీ, లింగపాలెం గ్రామానికి చెందిన సింగపోగు శ్రీనాథ్, రాయల పవన్ సాయి కృష్ణ, తుంబూరు గ్రామానికి చెందిన మారెళ్ల స్వామి, కారుమంచి రక్షక లు గంజాయి వ్యాపారంలో పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, గతంలో గంజాయి కేసులో నిందితుడైన సింహాద్రి, రంజిత్ తమ స్నేహితులైన మధిర కు చెందిన సూర్యదేవర రాజేశ్ అలియాస్ పండు, ఏలూరుకు చెందిన అశోక్, ఒడిశాకు చెందిన హంటల్ మధు సహకారంతో ఇరవై రోజుల క్రితం ఒడిశాకు వెళ్లి గంజాయి తెచ్చుకున్నారని తెలిపారు. అనంతరం రాజేశ్, అశోక్‌ల వద్ద సింహాద్రి కేజీన్నర గంజాయి కొనుగోలు చేసి సింగపోగు శ్రీనాథ్, రాయల పవన్‌లకు అమ్మినట్లు, అలాగే రంజిత్ అరకిలో గంజాయి కొనుగోలు చేసి కారుమంచి రక్షక, మారెళ్ల స్వామిలకు విక్రయించినట్లు విచారణలో తేలింది.గురువారం రేజర్ల గ్రామ శ్మశాన వాటిక దాటిన తరువాత డంపింగ్ యార్డు షెడ్ వద్ద సింహాద్రి, రంజిత్ తదితరులు గంజాయి పీలుస్తుండగా పోలీసుల పహారా బృందం గమనించింది. వెంటనే వారిని పట్టుకుని వారి వద్ద నుండి 320 గ్రాముల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ ఘటనపై మత్తు పదార్థాల నియంత్రణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, నిందితులను సత్తుపల్లి న్యాయస్థానానికి హాజరుపరిచినట్లు సత్తుపల్లి పోలీసు అధికారి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన గంజాయి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఎవరైనా గంజాయి కొనుగోలు, అమ్మకం లేదా వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గంజాయి వ్యాపారం గురించి సమాచారం అందించిన వారికి తగిన బహుమతి ఇవ్వబడుతుందని, వారి పేర్లు రహస్యంగా ఉంచబడతాయని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక




## పేద కుటుంబానికి ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్న ఉప్పరి నారాయణ

**పెద్దమందడి,అక్టోబర్16(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన రామగల చిన్న నాగన్న బుధవారం అనారోగ్యం కారణంగా ఆకస్మాత్తుగా మరణించారు.ఈ బాధాకర ఘటనను తెలుసుకున్న ఉప్పరి నారాయణ గురువారం స్వగృహానికి వెళ్లి పూల మాలలు అందిస్తూ మృతుని స్మరణార్థ నివాళులు అర్పించారు.మృతుని కుమారుడు రామగల్ల ప్రసాద్‌కి మద్దిగట్ల డీలర్ నాగరాజు, నత్తి చంద్రయ్య ఆధ్వర్యంలో ఉప్పరి నారాయణ మానవత్వాన్ని చాటుతూ రూ.5,000/ ఆర్థిక సాయం దహన సంస్కారాల కోసం అందజేశారు.అర్థిక సాయం అందజేసినందుకు కుటుంబ సభ్యులు ఉప్పరి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.




## బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఉభయ సభలలో తక్షణమే ప్రవేశపెట్టాలి

**నాచారం, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఉభయ సభలలో తక్షణమే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ముందు విద్యార్థులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ, "రాజ్యాంగ సవరణ ద్వారానే 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధ్యమని తెలిసినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి చేయడంలో విఫలమైంది" అని విమర్శించారు.అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలు చేయలేదని తెలిపారు. "ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బీసీ బిల్లును ఆమోదించి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలి," అని జంగయ్య డిమాండ్ చేశారు. బీసీల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు రవి, నాగరాజు, శ్రీకాంత్ ముదిరాజ్, నాగేంద్ర, నిఖిల్, శరత్ గౌడ్, ప్రసాద్, భాను, వెంకట్, ప్రణయ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



## మల్లాపూర్‌లో ఎస్ఎల్ఎన్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

ఎమ్మెల్యే పద్మారావు, బండారి లక్ష్మారెడ్డి

**మల్లాపూర్, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని మల్లాపూర్ డివిజన్‌లో ఎస్ఎల్ఎన్ ఫ్యామిలీ రెస్టారెంట్ అధినేత భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఎల్ఎన్ ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ బేకరీ గురువారం ఘనంగా ప్రారంభమైంది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పరమేశ్వర్ రెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, రెస్టారెంట్ ప్రారంభం స్థానిక వ్యాపార అభివృద్ధికి తోడ్పడటమే కాకుండా యువతకు ఉద్యోగావకాశాలు పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ, "ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రాంతీయ వాణిజ్యానికి నూతన ఊపిరి పోశించాం. యువతకు ఉపాధి, కుటుంబాలకు ఉత్తమమైన ఆహార, బేకరీ సేవలు అందించడమే మా లక్ష్యం" అని తెలిపారు. కార్యక్రమం లో స్థానిక వ్యాపారులు, ప్రజలు, కార్పొరేటర్ కార్యాలయ ప్రతినిధులు పాల్గొని, కొత్త వ్యాపార స్థాపన పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభం ప్రాంతీయ వాణిజ్య, ఉపాధి మరియు ఆహార ప్రమాణాల అభివృద్ధికి గణనీయమైన మద్దతుగా నిలుస్తుందని ప్రముఖులు అభిప్రాయపడ్డారు.

# మహిళలకు స్వయం ఉపాధి శిక్షణకు ఆర్థిక సహాయం





మర్రి రాజశేఖర్ రెడ్డి, జగదీష్ గౌడ్

**మల్కాజిగిరి, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగుగా మల్కాజిగిరి డివిజన్ సర్దార్ పటేల్ నగర్ మహిళా సమైక్య గ్రూప్ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందజేశారు. మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి రూ. 1,50,000/, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ రూ. 1,00,000/ మంజూరు చేశారు. మొత్తం రూ. 2,50,000/ (రెండు లక్షల యాభై వేల రూపాయలు) మహిళల శిక్షణా కార్యక్రమం కోసం వినియోగించనున్నారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ మాట్లాడుతూ, మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రుణ సదుపాయాలను ఉపయోగించుకొని ఆర్థికంగా ఎదగాలని పిలుపు నిచ్చారు. కుట్టు యంత్రాలు, ఇతర ఉపాధి సామాగ్రి కొనుగోలు చేసి స్వయం ఉపాధిని ఎంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య గ్రూప్ సభ్యులు ప్రేమలత, చంద్రకళ, లలిత, శారద, జయశ్రీ, వసంత, భాగ్యలక్ష్మి, మంజుల, తార, బిఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మణరావు, నీలం సతీష్, రాములు, శ్రీకాంత్, నవీన్ మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి స్థలం అప్పగింతకు చర్యలు...





జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -16, తెలంగాణ ముచ్చట్లు;** జిల్లాలో తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి స్థల అప్పగింత చర్యలు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్, తెలంగాణ దేవాదాయ శాఖ స్థపతి ఎన్. వాళ్ళినాయగం, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఖమ్మం అర్బన్ మండలంలోని అల్లీపురం వద్ద 20 ఎకరాల స్థలం గుర్తించి, తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణం, విడిది, అన్ని వసతులకు అనువుగా స్థల సేకరణ చేశామన్నారు. వేద పాఠశాల, కళ్యాణ మండపం, కళాక్షేత్రం, భజన మండపం తదితర అన్ని సౌకర్యాల కల్పనకు ఆగమ శాస్త్ర ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి ప్రముఖుల సందర్శనకు విడిది, హెలీప్యాడ్ సౌకర్యాల కల్పనకు ప్రణాళిక చేయాలన్నారు. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంతో జిల్లా ఆధ్యాత్మిక శోభతో పాటు పర్యాటకంగా, ఉపాధి పరంగా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష లో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ ఎం. వీరస్వామి, డిఇ రమేష్ బాబు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అధికారులు, పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణకు దశలవారీ ప్రయత్నం

చెలికాని ఫంక్షన్ హాల్‌లో సంఘటన సృష్టి అభియాన్ ఘనంగా నిర్వహణ.




**అశ్వారావుపేట, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి దమ్మపేట మండలం పట్వారిగూడెం చెలికాని ఫంక్షన్ హాల్‌లో సంఘటన సృష్టి అభియాన్ గురువారం జరిగింది. కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కాంగ్రెస్ పరిశీలకులు జాన్సన్ అబ్రహాం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
కాంగ్రెస్ పార్టీని మరింత పునరుద్ధరించడం, కొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకురావడం లక్ష్యంగా దేశవ్యాప్తంగా సంఘటన సృష్టి అభియాన్ నిర్వహిస్తున్నట్టు వివరించారు. ప్రతి జిల్లాలో కాంగ్రెస్ కమిటీని చురుకైన నాయకులతో బలోపేతం చేస్తూ, పార్టీకి కట్టుబడి పనిచేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు, యువతకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కొత్త కమిటీలు ఏర్పాటు చేసి, కాంగ్రెస్ కార్యకలాపాలను ప్రజల దరికి చేరేలా చేయనున్నట్టు తెలిపారు. ఇది కేవలం సంస్థాగత మార్పు మాత్రమే కాక, ప్రజల సమస్యల పట్ల స్పందించే కాంగ్రెస్ ఉద్యమానికి కొత్త ఊపిరి పోసే ప్రయత్నమని పార్టీ నేతలు పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు సమయానుకూల గుర్తింపు లభిస్తూ, ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# 18న తెలంగాణ బంద్‌కు ఎస్సీ, ఎస్టీ, బహుజన విద్యార్థి సంఘాల మద్దతు



**నాచారం, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఈనెల 18న జరగనున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టిన ఈ బంద్‌కు ఎస్సీ, ఎస్టీ విద్యార్థి మరియు బహుజన సంఘాలు మద్దతు ప్రకటించాయి.ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ, "బీసీల ఐక్యతను, చైతన్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే రోజు ఇది. బీసీలకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు," అని అన్నారు.అతను మాట్లాడుతూ, కోర్టులను వేదికలుగా చేసుకొని అగ్రకులాలు బీసీల రిజర్వేషన్లను అడ్డుకోవడం దారుణమని విమర్శించారు. బీసీల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీయాలనే కుట్రలకు బుద్ధి చెప్పేలా ఉద్యమం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈరెంటి విజయ మాదిగ (ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు), గద్దల అంజిబాబు (ఓయూ జేఏసీ), నూకమల్ల వీరస్వామి (మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు), బూర శ్రీనివాస్ గౌడ్ (తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు), నామ సైదులు, హంస (ఓయూ అధ్యక్షులు), జి. నర్సింహులు, డి. సంజీవ (ఎమ్మెస్ఎఫ్.టి రాష్ట్ర అధ్యక్షులు), ఓంకార్, సాయి, రవికిరణ్, బాలకృష్ణ, రవీందర్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# దీపావళి బాణాసంచా షాపుల కోసం ముందస్తు అనుమతి తప్పనిసరి

- అనుమతి లేకుండా షాపులు ఏర్పాటు చేయరాదు.
- దమ్మపేట పోలీసులు కఠిన చర్యలు హెచ్చరించారు.

**దమ్మపేట, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయదలచిన వ్యాపారులు ముందుగా అనుమతి పొందవలసిందిగా దమ్మపేట పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది. దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, టపాకాయల వ్యాపారులు పాల్వంచ సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలి. అనుమతి లేకుండా షాపులు ఏర్పాటు చేసిన వారిపై స్వేదయుద్ధాల చట్టం-1884 మరియు నియమాలు-1933 (సవరణ 2008) ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.
పోలీసుల సూచనల ప్రకారం, షాపులు ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలి. ఒక సమూహంలో 50 షాపులకంటే ఎక్కువ ఉండకూడదు. అలాగే, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, కళ్యాణ మండపాలు, సమావేశ కేంద్రాల్లో షాపులు ఏర్పాటు చేయరాదు.



# సాహిత్యానికి స్ఫూర్తిదాయకం పోతురాజు ప్రతిభ

**'నాన్నే నాహీరో' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాగమయి.**

**సత్తుపల్లి, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థి దశలోనే సాహిత్య సృజనలో ప్రతిభ కనబరచిన ఆవుల పోతురాజు నేటి యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గురువారం సత్తుపల్లిలో గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్ట్ ప్రచురించిన పోతురాజు బాలసాహిత్య రచన 'నాన్నే నాహీరో' పుస్తకాన్ని ఎమ్మెల్యే దంపతులు ఆవిష్కరించారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే సమాజానికి ఆణిముత్యాలు సిద్ధమవుతాయని ఆమె పేర్కొన్నారు. పేదరికం సృజనాత్మకతకు అడ్డంకి కాదని, గుడారంలో నివసిస్తూ తన రచనా ప్రతిభతో సమాజం దృష్టిని ఆకర్షించిన పోతురాజు ప్రశంసనీయం అని అన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో పోతురాజు తల్లి తిరుపతమ్మను, అతన్ని ప్రోత్సహించిన తెలుగు ఉపాధ్యాయురాలు ఎం.రమాదేవిని, ఎన్.సి.హెచ్. వెంకటాచార్యులు దంపతులను, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోందు షేక్‌ను, ట్రస్ట్ నిర్వాహకులు గార్లపాటి రామకృష్ణ, మధుసూదనరాజును ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆషా డైరెక్టర్ రామిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి నాగేశ్వరరావు, మహ్మద్ షాకీర్ హుస్సేన్, గోలి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హసన్ పర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ కమిషనర్




**హసన్ పర్తి, అక్టోబర్ 16(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం హసన్ పర్తి పోలీస్ స్టేషన్ ను తొలి సారిగా సందర్శించారు.ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, హసన్ పర్తి ఇన్స్ స్పెక్టర్ చేరాలు పోలీస్ కమిషనర్ కు పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బాధితులకు పారదర్శకంగా న్యాయం అందించాలని, నీతి, నిజాయితీగా విధులు నిర్వహిస్తూ ప్రజలు అభిమానాన్ని పొందాలని పోలీస్ కమిషనర్ సూచించి స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్ పరిధిలో లోని గ్రామాలు,ఎలాంటి ఫిర్యాదులు అధికంగా నమోదవుతాయి. నేరాల నియంత్రణకై తీసుకుంటున్న చర్యలు ,రౌడీ షీటర్లు,అనుమానిత వ్యక్తుల వివరాలతో పాటు స్టేషన్ అధికారులు నిర్వహిస్తున్న విధులపై అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు హన్మకొండ కరీంనగర్ ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకై తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# రోశయ్య రచనలు సమాజానికి స్ఫూర్తి

**స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో పుస్తకాల ఆవిష్కరణ**

**ఏ ఎస్ రావు నగర్, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో రచయిత రామిశెట్టి రోశయ్య రచించిన "స్వరాజ్యం స్థితప్రజ్ఞత" కథల సంకలనం, "ఫాసిజం బహురూపాలు" కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం రాత్రి కమలా నగర్‌లోని ఆఫీస్ పైన హాలులో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించగా, నాయకులు కృష్ణమాచార్యులు ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు. ప్రారంభంగా గురజాడ అప్పారావు రచించిన దేశభక్తి గీతాన్ని రుక్కయ్య ఆలపించారు. అనంతరం అభ్యుదయ గీతాలను నవ తెలంగాణ రవి, చల్లా లీలావతి పాడి సభను ఉత్సాహభరితంగా మార్చారు. రచయిత రోశయ్య జీవిత విశేషాలను శ్రీమన్నారాయణ వివరించారు. రెండు పుస్తకాల పరిచయాన్ని ప్రముఖ రచయిత పి. జ్యోతి సమగ్రంగా చేశారు. ఆమె మాట్లాడుతూ, "రోశయ్య కథల్లో సామాన్యుల గుండె చప్పుడు వినిపిస్తుంది. శతాధిక వయసు ఉన్నప్పటికీ ఆయన ప్రజా సమస్యలపై స్పందిస్తూ రాస్తుండటం విశేషం" అన్నారు.పుస్తకాలను ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు బండారు రవికుమార్, భూపతి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవి, జ్యోతి, గౌడుగు యాదగిరిరావు వేదికపై పాల్గొన్నారు. బండారు రవికుమార్ మాట్లాడుతూ, "రోశయ్య ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని విద్యను అభ్యసించారు. రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని సమాజ సేవ చేశారు. దాదాపు 20కి పైగా పుస్తకాలు రాసి సాహిత్యానికి తోడ్పాటునిచ్చారు" అన్నారు. ఆయన కుటుంబం అభ్యుదయ భావాలతో ముందుకు సాగుతోందని అన్నారు.భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "రోశయ్య రచనలు ప్రజాతంత్ర ఉద్యమానికి మార్గదర్శకం. నేటి పరిస్థితుల్లో ఆయన కలం ప్రజల చైతన్యానికి దిశానిర్దేశం చేస్తోంది" అన్నారు.ఈ సందర్భంగా రామిశెట్టి చైతన్య, జి. శివరామకృష్ణ, శారద, కృష్ణమాచార్యులు తదితరులు ప్రసంగించారు. ముందుమాట రచయిత వి.బి. ఆచార్యులు, రచయిత జయప్రకాష్ తరపున దుర్గాచారిలను చేనేత వస్త్రాలతో సత్కరించారు. రెండు పుస్తకాలను గౌడుగు యాదగిరిరావు, శ్రీమన్నారాయణ లకు అంకితం చేయగా, వారిని రోశయ్య కుటుంబ సభ్యులు, బండారు రవికుమార్ గౌరవించారు.చివరగా అతిథులు బండారు రవికుమార్, భూపతి వెంకటేశ్వర్లు, పి. జ్యోతి, మాధవి, రామిశెట్టి చైతన్య లను స్ఫూర్తి గ్రూప్ నాయకులు చేనేత వస్త్రాలతో సత్కరించారు. జయరాజు వందన సమర్పణ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, శ్రీనివాస్, ఏకే దుర్గాచారి, కోమటి రవి, గుమ్మడి హరిప్రసాద్, రోజారాణి, ఎం. భాస్కర్‌రావు , బాలు, శివన్నారాయణ, చల్లా లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి డిస్పెన్సరీలో గైనకాలజిస్ట్‌ను నియమించాలి



- ఉద్యోగుల సంక్షేమం కోసం సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలి.
- ఐఎన్టియుసీ బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్.

**సత్తుపల్లి, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి సింగరేణి డిస్పెన్సరీని అన్ని వసతులతో ఆధునికరించి, గైనకాలజిస్ట్ (ప్రసూతి నిపుణురాలు) డాక్టర్‌ను తక్షణమే నియమించాలని ఐఎన్టియుసీ బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్ విజ్ఞప్తి చేశారు.
అయన మాట్లాడుతూ, సత్తుపల్లిలో సింగరేణి సంస్థతో పాటు అనుబంధ ప్రైవేట్ ఓబీ కంపెనీలలో పనిచేస్తున్న సుమారు 3,500 మంది కార్మికులు మరియు వారి కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. డిస్పెన్సరీలో గైనకాలజిస్ట్ లేకపోవడంతో గర్భిణీ స్త్రీలు ప్రసూతి సంబంధిత వైద్య సలహాల కోసం కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రికి (సుమారు 90 కి.మీ దూరం) తరచుగా వెళ్లాల్సి వస్తుందని, దీనివల్ల ఆర్థికంగా మరియు శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
అలాగే, డిస్పెన్సరీలో పిల్లల వైద్యులు (చిల్డ్రెన్ స్పెషలిస్ట్) మరియు ఐసీయూ సదుపాయం లేకపోవడం వల్ల పదేళ్ల లోపు పిల్లలకు అత్యవసర వైద్యం అందించడం కష్టమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
సత్తుపల్లి ప్రాంతం సింగరేణికి సుమారు 16 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణాలో కీలక పాత్ర పోషిస్తోందని గుర్తుచేస్తూ, ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం మరింత కృషి చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి దేవదాస్, ఐఎన్టియుసీ బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ నాగప్రకాశ్, రామారావు (ఫిట్ సెక్రటరీ, జె.వి.ఆర్ ఓసీ), బాలాజీ (ఫిట్ సెక్రటరీ, కిష్టారం ఓసీ), నాగేశ్వరరావు (ఫిట్ సెక్రటరీ, జె.వి.ఆర్ సిఎచ్‌పి), అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి, సురేష్‌తో పాటు నాయకులు రషీద్, రఫీ, దావుద్, సదానందం, పొట్టి కిరణ్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, రాజేందర్, మురళి, హాఫీజ్, కట్ట కృష్ణ, రవికాంత్, రామంచి రాజయ్య, కే.రవి తదితరులు పాల్గొన్నారు.

# వి.ఎస్.టి కాలనీ, స్నేహపూర్ లో రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్




**నాచారం, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ నాచారం డివిజన్ పరిధిలోని వి.ఎస్.టి కాలనీ మరియు స్నేహపూర్ ప్రాంతాలలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక ప్రజల సౌకర్యార్థం, రాకపోకలకు అంతరాయం లేకుండా రోడ్లను నాణ్యతతో నిర్మించాలంటూ ఆయన సూచించారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో జరుగుతున్న ఈ పనులు త్వరితగతిన పూర్తవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు కార్పొరేటర్ ఆదేశాలు జారీ చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. అభివృద్ధి పనులు పూర్తయ్యాక కాలనీ వాసులు ఎదుర్కొంటున్న మురికి, నీటి నిల్వలు, దుమ్ము సమస్యలు తగ్గుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరించడం మాకు ప్రాధాన్యం. ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నాం," అని శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయకుమార్, టిఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, సువర్ణ, సుగుణాకర్ రావు, వాసు, రోహిత్, బాబర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు కార్పొరేటర్ చర్యలను అభినందించారు.

## సీనియర్ రిపోర్టర్ కనుకుంట్ల సతీష్ కి పితృవియోగం



**హసన్ పర్తి, అక్టోబర్ 16,(తెలంగాణ ముచ్చట):** హసన్ పర్తి మండల సీనియర్ రిపోర్టర్(ఫోటోగ్రాఫర్) కనుకుంట్ల సతీష్ కి పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి కనుకుంట్ల ముత్తయ్య గురువారం రోజున స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. దివంగత ముత్తయ్య మృతదేహాన్ని చివరి దర్శనార్థం స్వగృహంలో ఉంచగా, మండల వ్యాప్తంగా పత్రికా మిత్రులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు, బంధువులు, ఫోటోగ్రాఫర్లు కలిసి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మరణ వార్త తెలిసిన సహచర జర్నలిస్టులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు ముత్తయ్య సేవలను స్మరించారు. దివంగత కనుకుంట్ల ముత్తయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ప్రగాఢ సంతాపం తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ విలేకరులు ఎలుక రాజు సదానందం, కాందారి అనిల్,వేల్పుల ఓదేలు,తాళ్లపల్లి సాయికుమార్,తంగళ్ళపల్లి సాంబమూర్తి ,గడ్డం సంపత్,సయ్యద్ అహ్మద్,సందెల కిషోర్,దాడి చిరంజీవి,జక్కుల విజయ్, స్థానిక నాయకులు కార్పొరేటర్ శివకుమార్,వీసం సురేందర్ రెడ్డి,పాపిశెట్టి శ్రీధర్,కనపర్తి కిరణ్,అరెల్లి వెంకటస్వామి,మీసరికొండ సాంబయ్య,దీకొండ బిక్షపతి,డాన్స్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బేతుపల్లి అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం

- పోషకాహారం పై అవగాహన.
- తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువల ఆహార ప్రదర్శన.

**సత్తుపల్లి, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** పోషణ మాసం సందర్భంగా బేతుపల్లి గ్రామం అంగన్వాడి కేంద్రంలో గంగారం సెక్టార్ ఆధ్వర్యంలో సిడిపిఓ మెహరీన్ నిషా బేగం సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువల ఆహార పదార్థాల ప్రదర్శన (డెమానిస్ట్రేషన్) నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు సీమంతాలు, శిశువులకు అన్నప్రాశనం, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించి పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సత్తుపల్లి సిహెచ్ఓ అన్నమ్మ, హెచ్ఎస్ శారారాణి, విజయకుమారి, సెక్టార్ సూపర్వైజర్ గంగాజలం, ప్రాజెక్టు బీసీ ప్రసాద్, శిరీష, ఏఎన్ఎం సరోజినీ, ఆశా పాపా, తల్లులు, పిల్లలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



## దశదిన కర్మల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకుడు సోయం వీరభద్రం



**దమ్మపేట, అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వరావుపేట నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు సోయం వీరభద్రం గురువారం దమ్మపేట మండలం, మల్కారం గ్రామంలో నిర్వహించిన నల్లపు సుబ్బారావు దశదిన కర్మకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సుబ్బారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో దమ్మపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు దొడ్డా రమేష్, పార్టీ సీనియర్ నాయకులు గాజుబోయిన ఏసుబాబు, కోర్సా వెంకటేష్, నల్లపు నాగేంద్రరావు, తిరువీధుల ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# లంచం తీసుకుంటు పట్టుబడ్డ నల్లగొండ ఫైర్ స్టేషన్ అధికారి సత్యనారాయణ రెడ్డి



**నల్లగొండ,అక్టోబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం నల్లగొండ ఫైర్ స్టేషన్ అధికారి ఎ. సత్యనారాయణ రెడ్డిని రూ.8,000 లంచం తీసుకుంటుండగా పట్టుబట్టారు. లంచం ఫిర్యాదుదారుని తాత్కాలిక లైసెన్స్ దరఖాస్తును ప్రాసెస్ చేసి, దీపావళి పండుగ సందర్భంగా ఎన్జి కాలేజ్ గ్రౌండ్‌లో బాణసంచా దుకాణం నడపడానికి అవసరమైన నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసి) ఇవ్వడానికి డిమాండ్ చేయడంలో తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ తెలిపారు. ఫిర్యాదుదారు మొదట రూ.10,000 డిమాండ్ చేసినప్పటికీ, అధికారి చర్చల తర్వాత రూ.8,000కి అంగీకరించాడు. లంచం డబ్బు ఇవ్వడానికి అధికారి ఫైర్ స్టేషన్ పక్కన ఉన్న ఎన్జి కాలేజ్ గ్రౌండ్‌కి రావమని, తన మోటార్‌సైకిల్ పాకెట్‌లో డబ్బు పెట్టమని సూచించాడు. ఈ సమయంలో ఏసీబీ టీమ్ అధికారిని రెడ్‌హ్యాండ్‌లో పట్టుబట్టి, మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో లంచం డబ్బును కూడా స్వాధీనం చేసుకుంది. అనంతరం, ఫైర్ స్టేషన్ ఆఫీసులో రికార్డులను తనిఖీ చేసి, అధికారి నివాసంలో అదనపు రైడ్స్ నిర్వహించారు. అధికారికి మునుపటి సర్వీస్ రికార్డుల్లో ఇప్పటికే చెడు చరిత్ర ఉన్నట్లు గుర్తించబడింది.ఈ ఘటన ఏసీబీ అధికారులు తక్షణమే ప్రారంభించిన ఆపరేషన్‌లో భాగంగా జరిగింది. ఎ. సత్యనారాయణ రెడ్డిని హైదరాబాద్‌లోని ఎస్పీఈ & ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నారు. ఇంకా పూర్తి దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఏసీబీ ప్రజలకు పిలుపునిచ్చి, రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయమని సూచించింది. ఫిర్యాదులు టోల్ ఫ్రీ నెంబర్ 1064, వాట్సాప్ 9440446106, ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (@ TelanganaACB) మరియు అధికారిక వెబ్‌సైట్ acb.telangana.gov.in ద్వారా చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, అవినీతి వ్యతిరేక చర్యలు కఠినంగా కొనసాగుతాయని ఏసీబీ స్పష్టం చేసింది. ఈ ఘటన తెలంగాణలో అవినీతి నిర్మూలన పోరాటానికి మరో ఉదాహరణగా నిలిచింది. ఇటీవల నల్లగొండ జిల్లాలో తహసీల్దార్ గుగులోతు కృష్ణ రూ.2 లక్షల లంచం వసూలు చేసిన ఘటనలో ఏసీబీ చేత పట్టుబడ్డారు.ప్రజల సహకారమే అవినీతి మూలాలను బలహీనపరచగలదని ఏసీపీ డీజీపీ కొందా వెంకటరామణ రెడ్డి హృదయపూర్వకంగా పిలుపునిచ్చారు.

# టీచింగ్ పోస్టులకు దరఖాస్తు సమర్పించాలి...

## జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ముజాహిద్

**ఖమ్మం, అక్టోబర్ -16, , తెలంగాణ ముచ్చట్లు;** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో నడుస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేయుటకు ఆసక్తి గల వారు అక్టోబర్ 22 లోపు దరఖాస్తు సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.డి. ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి బాయ్స్ నందు జనరల్ టిజిటి హిందీ, ఖమ్మం బాయ్స్ నందు జనరల్ జెఎల్ జువాలజీ, స్త్రీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా ఖమ్మం బాలికల జూనియర్ కళాశాల నందు జె.ఎల్. ఫిజిక్స్ పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయని అన్నారు. జె.ఎల్, పిజిటి పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీ 50 శాతం మార్కులతో పాటు బీ.ఈడీ. లో 50 శాతం మార్కులు, టి.జి.టి. హిందీ పోస్టుకు గ్రాడ్యుయేషన్ లో 50 శాతం, హెచ్.పి.టి. లో ఉత్తీర్ణత, టెట్ తప్పనిసరని, బోధన అనుభవం 3 సంవత్సరాలు ఉండి, అభ్యర్థులు ఖమ్మం జిల్లాకు చెందిన వారై ఉండాలని అన్నారు. అభ్యర్థుల తమ పూర్తి బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్ ఫోటో కాపీలు, ఇతర పత్రాలతో సంబంధిత మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు అక్టోబర్ 17 నుంచి అక్టోబర్ 22 సాయంత్రం 4.00 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని, షార్ట్ లిస్ట్ అయినా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ నియామకాలు పూర్తిగా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన తాత్కాలికంగా ఉంటాయని, నియామక అధికారుల నిర్ణయం తుది నిర్ణయం అవుతుందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వరంగల్‌లో నేషనల్ ఓపెన్ అండర్23 అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య

- -క్రీడలకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం
- జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని క్రీడాకారులకు సౌకర్యవంతంగా అభివృద్ధి
- 945 అథ్లెటిక్స్‌లో 20 మంది తెలంగాణకు చెందినవారు
- భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ విజయాల ఆకాంక్ష




**హనుమకొండ,అక్టోబర్16 (తెలంగాణ ముచ్చట్లు):**

జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం ప్రారంభమైన 5వ నేషనల్ ఓపెన్ అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు.ఈ సందర్భంలో ఎంపీ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఖేలో ఇండియా-2026 క్రీడలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు, అలాగే 2036లో భారత్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో కొన్ని గేమ్స్ తెలంగాణలో నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని క్రీడాకారులకు అనువుగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని ఎంపీ తెలిపారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, క్రీడా స్ఫూర్తితో ప్రతి క్రీడాకారుడు పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 945 మంది మహిళా అథ్లెటిక్స్ పాల్గొంటున్నారు, వారిలో 20 మంది తెలంగాణకు చెందినవారని ఎంపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చైర్మన్ ఎర్రబెల్లి రాజేశ్వరరావు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, మేయర్ గుండు సుధారాణి, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, క్రీడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# అక్టోబర్ 18న బీసీ బంద్ విజయవంతం చేయాలి

## నక్క కృష్ణ యాదవ్ పెద్దమండడి మండల ఐక్యవేదిక అధ్యక్షులు



**పెద్దమండడి,అక్టోబర్16(తెలంగాణ ముచ్చట్లు):** బీసీ రిజర్వేషన్ 42% సాధన దిశగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమానికి ఐక్యతతో మద్దతు తెలపాలని పెద్దమండడి మండల ఐక్యవేదిక అధ్యక్షుడు నక్క కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. అక్టోబర్ 18న జరగబోయే బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన అన్ని వర్గాల ప్రజలను కోరారు. ఈ సందర్భంగా నక్క కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. "బీసీ వర్గాల జనాభా రాష్ట్రంలో 52% ఉన్నా, రిజర్వేషన్లు మాత్రం కేవలం 29% మాత్రమే ఉన్నాయి. విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యంలో బీసీలు ఇంకా వెనుకబడి ఉన్నారు. అందుకే బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించడం సమాజ సమానత్వానికి దోహదం చేస్తుంది. ఈ బంద్ ప్రధాన ఉద్దేశం — బీసీ హక్కుల సాధన కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయడం" అన్నారు. అలాగే ఆయన "బీసీ రిజర్వేషన్ 42% కల్పిస్తే విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు మరిన్ని అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల్లో నాయకత్వ స్థానాలు లభిస్తాయి. ఇది బీసీ వర్గాల ఆర్థిక, సామాజిక స్థాయిని బలోపేతం చేస్తుంది" అన్నారు.మండలంలోని అన్ని బీసీ సంఘాలు, విద్యాసంస్థలు, వ్యాపార వర్గాలు, ప్రజా సంస్థలు బంద్‌కి మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని నక్క కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. అలాగే బంద్ శాంతియుతంగా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిర్వహించాలన్నారు.

# మామునూరు ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి మరో 90 కోట్లు

## సీఎం రేవంత్‌కు ఎంపీ కడియం కావ్య కృతజ్ఞతలు



**హనుమకొండ,అక్టోబర్16(తెలంగాణ ముచ్చట్లు):** మామునూరు విమానాశ్రయ అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 90 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ నిధులతో టెర్మినల్ భవనం నిర్మాణం, రన్‌వే పొడిగింపు, లైటింగ్, భద్రతా కంచె ఏర్పాటు వంటి కీలక పనులు చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. భూ సేకరణ కోసం ఇప్పటికే ప్రభుత్వం 205 కోట్లు విడుదల చేయగా, తాజాగా మరింతగా 90 కోట్లు మంజూరు చేయడం వరంగల్ ప్రజల దీర్ఘకాల స్వప్నానికి ఊతమని ఎంపీ తెలిపారు.

మామునూరు విమానాశ్రయం పూర్తి స్థాయి కార్యకలాపాలకు సిద్ధమవుతున్నదని, ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత చొరవ కారణమని ఆమె అభిప్రాయపడ్డారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల అభివృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం విమానాశ్రయ ప్రాజెక్టుపై చూపుతున్న దృష్టి అభినందనీయమని ఎంపీ పేర్కొని, వరంగల్ ప్రజల తరపున ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రమాదానికి తర్వాత పరితాపం కాదు వెంటనే సహాయం అందే వ్యవస్థ కావాలి



: విశ్లేషణ :

**మునిగాల రాజు పాత్రికేయులు,**
**డిజైనర్ టెక్ గురు. 8897975262**

'ప్రాణాలు కాపాడేది కేవలం ఆసుపత్రి కాదు సమయానికి అందే తొలి వైద్య సహాయం ట్రామా అనే పదం ప్రమాదంతో ప్రారంభమై ప్రాణానికి ముప్పుగా నిలిచే ప్రతి పరిస్థితిని సూచిస్తుంది. రోడ్డు ప్రమాదం జరిగిన క్షణం నుంచి ఆసుపత్రి చేరే క్షణం వరకు గడిచే ప్రతి నిమిషం జీవితానికి కీలకం. కానీ మన దేశంలో ఈ సమయం అనవసర ఆలస్యం, ఆసహాయ పరిస్థితులు, సక్రమమైన అత్యవసర సదుపాయాల లేమితో నిండిపోతుంది. ఆ విలువైన నిమిషాలు కనీస సాయం అందక ప్రాణాలు జారిపోతాయి. ఇది ఒక్కరి బాధ కాదు సమాజం మొత్తం బాధ్యత. ప్రతి సంవత్సరం వేలాది మంది రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, అకస్మాత్తుగా కలిగే గాయాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. చాలా సందర్భాల్లో గాయానికి కన్నా గాయం తర్వాత చికిత్స అందకపోవడమే అసలు కారణం. సమయానికి రక్తస్రావం ఆపి ఉండినా, కాళ్లు లేదా చేతికి సపోర్టు ఇచ్చినా, శ్వాస ఆపకుండా చూసినా ప్రాణాలు కాపాడేవి. కాని ఈ బేసిక్ సహాయం ఇవ్వడానికి శిక్షణ పొందిన హెల్ప్ సిబ్బంది చాలా చోట్ల లేరు. ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లడం సరిపోదు. ఆ సమయంలో గాయంపై తీసుకునే తొలి చర్యే అసలు ప్రాణరక్ష. విదేశాలలో వీధుల్లో తిరిగే సాధారణ పౌరులు కూడా ఫస్ట్ ఎయిడ్ శిక్షణ పొంది ఉంటారు. వారు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వచ్చే వరకు ప్రాణాలను నిలబెడతారు. కానీ మన దేశంలో ఇలాంటి శిక్షణ సాధారణ ప్రజలకు అందించడం అనే భావన ఇంకా సరైన స్థాయిలో ప్రసారం కాలేదు. అంబులెన్స్ రావడానికి ఆలస్యం అవుతే గాయపడిన వాడిని వాహనంలో ఎక్కించి పరుగులు పెట్టడం మన సహజ విధానం. కానీ గాయపడిన శరీరాన్ని సరిగ్గా కదిలించకపోవడం మరింత ప్రమాదం అవుతుందని చాలామంది తెలుసుకోలేకపోతున్నారు. తల గాయాలు, వెన్నెముక గాయాలు వంటి సందర్భాల్లో ఒక తప్పు కదలిక శాశ్వత వికలాంగతకు దారి తీస్తుంది. ఇది తెలిసినా తెలియకపోయినా మనం చేస్తున్న సహాయం కొన్నిసార్లు హానికరమవుతుంది.

ప్రభుత్వాలు రోడ్డు భద్రతపై ప్రచారం చేస్తాయి, కానీ ప్రమాదం జరిగినప్పుడు స్పందన వేగం పెంచడంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. ప్రతి ఐదు నుండి పది కిలోమీటర్లకు ఒక అత్యవసర మెడికల్ పాయింట్ ఏర్పాటు చేయడం అనే డిమాండ్ చాలా కాలంగా వింటున్నాం. కానీ ఆ అవసరం ఇప్పటికీ నీడలోనే ఉంది. అంబులెన్స్‌లు ఉంటాయి కానీ అందులో అవసరమైన పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది చాలాసార్లు కనిపించరు.

గ్రామాల్లో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుంది. ఎవరైనా గాయపడితే సమీప ఆసుపత్రి వెళ్లడానికి తగిన వాహనం, రోడ్డు, వైద్య సిబ్బంది అన్నీ దొరకాలని ఆశించడం కష్టమే. బంధుమిత్రులు చేత్తో మోసుకుపోయే దృశ్యాలు ఇప్పటికీ కనిపిస్తాయి. హెల్త్ సిస్టమ్ అంటే కేవలం ఆసుపత్రి కట్టడం కాదు, సమయానికి స్పందించే చర్యల వ్యవస్థను నిర్మించడం కూడా అని గుర్తించాలి. ట్రామా అంటే ఒక వ్యక్తి గాయపడిన బాధ మాత్రమే కాదు, ఆ గాయంతో కుటుంబం మొత్తం ఎదుర్కొనే మానసిక, ఆర్థిక ఒత్తిడి కూడా. దాదాపు ప్రతి ప్రమాదం తర్వాత జరిగే సంఘటనలు ఒక కుటుంబాన్ని కదిలించే శక్తి కలిగి ఉంటాయి. ప్రమాదం జరిగిన తర్వాత ప్రారంభమయ్యే ఈ మౌన యుద్ధం గురించి కూడా సమాజం మాట్లాడాలి. ఈ పరిస్థితుల్లో ప్రపంచ ట్రామా దినం ఒక గుర్తు. ప్రాణానికి హాని కలిగే సంఘటనలు ఎవరికి ఎప్పుడు ఎదురవుతాయో ఎవరికీ తెలియదు. కానీ ఆ క్షణంలో మనం ఎలా స్పందించాలో తెలిసి ఉండాలి. శిక్షణ పొందిన ప్రజలు, సిద్ధంగా ఉన్న వైద్య బృందాలు, సదుపాయాలు కలిగిన అంబులెన్స్‌లు కలిసొచ్చినప్పుడే అసలు మార్పు సాధ్యమవుతుంది. మన జీవిత రహదారి సురక్షితంగా ఉండాలి అంటే మన స్పందన వేగం కూడా మారాలి.

# దీన్ని తొక్కే కదాని పడేస్తే అద్భుత లాభాలని కోల్పోతారు?

వెల్లుల్లి తొక్క ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు చేస్తుంది. మనకు పాదాల వాపు సమస్య ఉంటుంది. ఈ సమస్యని ఈజీగా తగ్గించడానికి మార్కెట్లో చాలా రకాల నూనెలు అందుబాటులో ఉన్నప్పటికీ, మీరు వెల్లుల్లి తొక్కను ఉపయోగించడం ద్వారా ఈ నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. ఉదయం సాయంత్రం వెల్లుల్లి పొట్టులో తేనె వేసుకుని తీసుకుంటే ఆస్తమా నుంచి బయటపడొచ్చు. అలాగే కాళ్ల వాపుల నుండి కూడా వెల్లుల్లి పొట్టు రక్షిస్తుంది. ఇందుకోసం వెల్లుల్లి తొక్కను నీటిలో ఉడకబెట్టాలి. బాగా మరిగిన నీరు గోరు వెచ్చగా ఉన్నప్పుడు మీ పాదాలను ఆ నీటిలో ఉంచండి. క్రమంగా, పాదాల వాపు, నొప్పి నుండి ఉపశమనం పొందుతారు. జుట్టు రాలడం లేదా తెల్ల జుట్టు సమస్యతో బాధపడుతుంటే, వెల్లుల్లి తొక్క నీరు ప్రయోజనకరంగా ఉంటుంది. దీని కోసం, వెల్లుల్లి తొక్కను నీటిలో ఉడకబెట్టి, ఆపై ఈ నీటితో మీ జుట్టును కడగాలి. లేదా స్ప్రే బాటిల్‌లో పోసుకుని జుట్టుకు, మాడుకు బాగా స్ప్రే చేసుకోవాలి. చుండ్రు, పేండ్లు వంటి సమస్యలతో బాధపడేవారు వెల్లుల్లి పేస్ట్‌లో కొంచెం నీళ్లు కలిపి తలకు బాగా పట్టించాలి. మరొక పద్ధతి కూడా ఉంది. వెల్లుల్లి తొక్కను వేయించి పొడి చేసి కొబ్బరినూనెలో కలిపి జుట్టుకు రాసుకుంటే తెల్లజుట్టు వేరు నుండే నల్లగా మారడం ప్రారంభమవుతుంది. వెల్లుల్లి తొక్కను నీటిలో కాసేపు నానబెట్టి ఆ తర్వాత ఈ నీటిని అలర్జీ ఉన్న ప్రాంతంలో అప్లై చేయండి. ఈ రెమెడీని ప్రతిరోజూ చేయడం వల్ల దురద సమస్య నుండి త్వరగా ఉపశమనం పొందుతారు. అంతే కాదు ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలను తగ్గించడంలో కూడా మేలు చేస్తాయి. ఇంకా వెల్లుల్లి తొక్కను నీటిలో కాసేపు నానబెట్టి ఆ తర్వాత ఈ నీటిని అలర్జీ ఉన్న ప్రాంతంలో అప్లై చేయండి. ఈ రెమెడీని ప్రతిరోజూ చేయడం వల్ల దురద సమస్య నుండి త్వరగా ఉపశమనం పొందుతారు.





## ఖాళీ కడుపుతో కొత్తిమీర నీళ్లు తాగితే..?

కొత్తిమీర నీరు ఎసిడిటీ, పిత్తాను తగ్గించడంలో చాలా మేలు చేస్తుంది. కొత్తిమీరలోని గుణాలు పొట్టకు మేలు చేస్తాయి. కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపులో యాసిడ్ స్థాయి తగ్గుతుంది. ఎసిడిటీ వల్ల వచ్చే మంట, నొప్పి తగ్గుతుంది. కొత్తిమీరలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది అసిడిటీ వల్ల వచ్చే సమస్యలను తగ్గిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపు సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కొత్తిమీర నీరు మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. కొత్తిమీరలో అధిక పీచు ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొత్తిమీర గింజలలో ఉండే థైమోల్ అనే పదార్థం మలబద్ధకం నుండి ఉపశమనం కలిగించే జీర్ణ రసాల స్రావాన్ని పెంచుతుంది. అలాగే, కొత్తిమీర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. బరువు నియంత్రణ, బరువు తగ్గడంలో కొత్తిమీర నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కొత్తిమీరలో ఉండే ఫైబర్ కడుపు నిండుగా ఉంచుతుంది. ఆకలి దప్పులను తగ్గిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణలో సహాయపడుతుంది. కొత్తిమీరలో ఉన్న పాలీఫెనాల్ యాంటీ ఆక్సిడెంట్లు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. థైరాయిడ్ సమస్యలకు సహజ నివారణగా పనిచేస్తుంది. కొత్తిమీర ఆకులు, కాండం యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి సరైన థైరాయిడ్ పనితీరుకు సహాయపడతాయి.


# నెల రోజులపాటు అన్నం తినకపోతే..?

బరువు తగ్గడానికి ప్రజలు చాలా కష్టపడతారు. ఆహార నియంత్రణ కూడా చాలా ముఖ్యం. బరువు తగ్గాలనుకునే వారు నెల రోజులు అన్నాన్ని వదిలేస్తే.. మరికొద్ది రోజుల్లో తేడా మీకే తెలుస్తుంది. బియ్యం వేగంగా కేలరీలను పెంచుతుంది.. జీవక్రియను నెమ్మదిస్తుంది. ఇది పొట్ట కొవ్వు, ఊబకాయాన్ని పెంచుతుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే ఒక నెలపాటు అన్నం మానేయండి. మనం ఎక్కువ కార్బోహైడ్రేట్లను తీసుకున్నప్పుడు వాటిని జీర్ణం చేయడానికి మనకు ఎక్కువ చక్కెర అవసరం. అప్పుడు మన శరీరంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. శరీరంలో షుగర్ లెవెల్ పెరిగితే మధుమేహం సమస్య తీవ్రమవుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు సమస్య పెరుగుతుంది. అలాగే థైరాయిడ్, పీసీఓడీ బాధితులకు కూడా ఇది మంచిది కాదు. ఏదైనా వ్యాధితో బాధపడేవారు శరీరంలో చక్కెర స్థాయిని నియంత్రించడానికి అన్నం తక్కువగా తినాలి. షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలి. అన్నం తినడం వల్ల బద్ధకం పెరుగుతుంది. తరచుగా నిద్ర వస్తుంది. దీనివల్ల పనిపై ఆసక్తి ఉండదు. కానీ, అన్నం తినడం మానేస్తే శరీరం మునుపటి కంటే చురుగ్గా మారుతుంది. సోమరితనం తగ్గుతుంది. కూర్చున్న, నిలబడినా నిద్ర మత్తు ఉండదు. మీరు ఇంతకు ముందెన్నడూ అనుభవించని అనేక మార్పులను మీరు గమనిస్తారు. శరీరం బరువు తగ్గినట్లు అనిపిస్తుంది. దీంతో మీ మెదడు మరింత చురుకుగా ఉండటం వల్ల మీరు వేగంగా పని చేస్తారు. బియ్యంలో లభించే కార్బోహైడ్రేట్లు మన శరీరానికి శక్తినివ్వడానికి అవసరం. దాన్ని పక్కన పెడితే మనల్ని బలహీనపరుస్తుంది. దీనివల్ల కండరాలు బలహీనపడతాయి. శరీరంలో పోషకాలు, ఖనిజాల లోపం సంభవించవచ్చు. శరీరంలోని కొవ్వును తగ్గించడమే లక్ష్యం కావాలి. కండరాలను బలహీనపరచవద్దు.



# వీటిని మామిడిపండ్లతో కలిపి తిన్నారంటే..


**విషంతో సమానమే.!**



పండ్లకు రారాజు మామిడి. వేసవి వచ్చిందంటే చాలు.. అందరూ కూడా నోరూరించే మామిడిపండ్లను తెగ లాగించేస్తుంటారు. మామిడిలో విటమిన్ ఎ, సితో పాటు ఐరన్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి కావల్సినంత శక్తిని అందిస్తాయి. అయితే మామిడితో పాటు కొన్ని ఆహార పదార్థాలను తింటే.. కచ్చితంగా లేనిపోని అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నట్టే. మరి అవేంటంటే.? మామిడి పండ్లు తిన్న వెంటనే పెరుగు తినడం సరికాదని వైద్యులు చెబుతున్నారు. ఈ రెండిరటిని కలిపి తినడం వల్ల ఎక్కువగా కార్బన్ డయాక్సైడ్ తయారయ్యి.. శరీరానికి చాలా సమస్యలు తెచ్చిపెడుతుందట. అలాగే మామిడితో పాటు మిరపకాయలు తిన్నా.. కడుపు, చర్మ వ్యాధులకు దారి తీస్తుందని వైద్యుల సూచన. మామిడి, కాకరకాయ కలిపి తినడం వల్ల వికారం, వాంతులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుందట. ఇక మామిడి తిన్న వెంటనే శీతల పానీయాలు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయని డాక్టర్లు చెబుతున్నారు. డయాబెటిక్ రోగులకు ఇది చాలా ప్రమాదకరమని అంటున్నారు. అటు మామిడి తిన్న తర్వాత నీరు తాగితే కడుపు నొప్పి, గ్యాస్, అసిడిటీ ఏర్పడతాయట. అందుకే మామిడి తిన్న అరగంటకు నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

## పిత్తాశయంలో రాళ్లు ఎందుకు ఏర్పడతాయో

ఆరోగ్యమే మహాభాగ్యం.. అందుకే ఆరోగ్యంపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.. ప్రస్తుత కాలంలో ఎన్నో వ్యాధులు వెంటాడుతున్నాయి. కావున.. ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను తెలుసుకోవడం చాలా ముఖ్యం.. మన శరీరంలో కొన్ని ప్రత్యేక అవయవాలు ఉన్నాయి.. వాటి పనితీరు ఏ మాత్రం మందగించినా లేదా వాటికి ఆటంకం ఏర్పడినా వ్యక్తి తట్టుకోవడం కష్టం.. అటువంటి అవయవాల్లో పిత్తాశయం ఒకటి.. జీర్ణవ్యవస్థలో పిత్తాశయం ఒక ముఖ్యమైన భాగం. ఇది పిత్త వాహిక ద్వారా కాలేయం.. చిన్న ప్రేగులకు అనుసంధానించబడి ఉంటుంది. కొవ్వును జీర్ణం చేసే ఒక ప్రత్యేక రకం ఎంజైమ్ కాలేయంలో ఉత్పత్తి అవుతుంది.



దీనినే పిత్తం అంటారు. కాలేయం నుంచి ఇది పిత్త వాహిక ద్వారా గాల్ బ్లాడర్‌లో జమ అవుతుంది. ప్రస్తుతకాలంలో పిత్తాశయంలో రాళ్లు చాలా సాధారణ వ్యాధిగా మారాయి. చెడు ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా ఇది జరుగుతుంది. సాధారణంగా స్టోన్ గురించి వినగానే ప్రజలు చాలా తరచుగా భయాందోళనలకు గురవుతారు. రాళ్లకు సకాలంలో చికిత్స చేస్తే, మీరు ఈ వ్యాధిని వదిలించుకోవచ్చు. కానీ పదే పదే నిర్లక్ష్యం చేస్తే అది తీవ్రమైన వ్యాధిగా రూపం దాల్చుతుంది. ఆహారంలో ఉన్న కొవ్వును జీర్ణం చేయడానికి, పిత్త వాహిక పిత్తాశయం ద్వారా చిన్న ప్రేగులోకి వెళుతుంది. కొన్నిసార్లు ఈ పిత్తాశయం (గాల్ బ్లాడర్) లో రాళ్లు క్రమంగా ఏర్పడటం ప్రారంభిస్తాయి. ఇది ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. పిత్తాశయంలో కాల్షియం, మినరల్స్ చేరడం వల్ల రాళ్లు ఏర్పడటం ప్రారంభమవుతుందని చాలా మందికి అపోహ ఉంది. కానీ చాలా పరిశోధనలు దీనిని పూర్తిగా కొట్టిపారేస్తున్నాయి. పరిశోధనల ప్రకారం.. గాల్ బ్లాడర్‌లో కొలెస్ట్రాల్ అధికంగా చేరడం వల్ల రాళ్ల సమస్య ఏర్పడుతుంది. 40 ఏళ్లు పైబడిన మహిళలు, ముఖ్యంగా అధిక బరువు ఉన్నవారిలో పిత్తాశయంలో రాళ్ల సమస్య ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక అనారోగ్యం తర్వాత రాళ్ల సమస్య తరచుగా సంభవిస్తుంది. పిత్తాశయం నుంచి రాళ్ళు పిత్త వాహికలోకి ప్రవేశిస్తే.. అది కామెర్లు.. ప్యాంక్రియాస్‌లో వాపు వంటి తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. ఈ వ్యాధికి ఎక్కువ కాలం చికిత్స చేయకపోతే క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కారణం కావచ్చు.



## రాత్రి మిగిలిన చపాతీ పడేస్తున్నారా..?

ముందు రోజు రాత్రి భోజనంలో మిగిలిపోయిన రోటీని మర్నాడు తింటే ఏమవుతుంది..? ఇలా మిగిలిపోయిన రోటీ, చపాతీలను ఆ మార్నడు తింటే ఏమవుతుందో తెలుసా..? అయితే, చాలా మంది ఇలా మిగిలిపోయిన చపాతీలు తినేందుకు భయపడుతుంటారు. ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తే ప్రమాదం ఉంటుందని ఆందోళన చెందుతుంటారు. కానీ, దీన్ని తినడం వల్ల మధుమేహం, బరువు పెరగడం వంటి అనేక సమస్యలు నయం అవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. మిగిలి పోయిన చాపాతీలు ఆ మర్నాడు తింటే కలిగే అద్భుతమైన ప్రయోజనాలను ఇక్కడ తెలుసుకుందాం.. ప్రతి ఒక్కరూ అప్పుడే పాన్ మీద నుంచి తీసిన వేడి వేడి రోటీని తినడానికి ఇష్టపడతారు. కానీ రాత్రి మిగిలిపోయిన పాత రోటీ విషయానికి వస్తే, చాలా మంది ఆకలిని చంపేసుకుంటుంటారు. కానీ, రాత్రి మిగిలిన చపాతీ మన రోగనిరోధక శక్తిని పెంచుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అందుకని రాత్రి మిగిలిపోయిన రోటీని మళ్లీ నూనె పోసి వేడిచేయటం కాకుండా అలాగే తినాలని చెబుతున్నారు. మిగిలిపోయిన రోటీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీర్ణ సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. మీకు మలబద్ధకం సమస్య ఉంటే ,ఇలా రాత్రి మిగిలిపోయిన చపాతీ తింటే మంచిది. ఉదయాన్నే దీన్ని తినడం వల్ల కడుపు ఉబ్బరం, ఎసిడిటీ వంటి సమస్యల నుంచి కూడా బయటపడవచ్చు. బరువు తగ్గడానికి కూడా ఉపయోగపడుతుంది. బరువును నియంత్రించడంలో ఇలా సద్ది రొట్టె తినడం ప్రయోజనకరంగా ఉంటుంది . తాజా రొట్టెతో పోలిస్తే సద్ది రొట్టెలో తక్కువ కేలరీలు ఉన్నాయి. త్వరగా బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న వారికి సహాయపడుతుంది. అంతేకాదు.. రక్తపోటును కూడా నియంత్రిస్తుంది. మధుమేహ రోగులకు ఉదయం పాలతో మంచి అల్పాహారంగా పనిచేస్తుంది.

# బెండకాయ తింటే జరిగేది ఇదే..

బెండకాయ.. చాలా మంది ఇష్టపడే కూరగాయాల్లో ఇది కూడా ఒకటి. దీని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పని లేదు. దాదాపు ప్రతి ఇంటిలో వారంలో ఒక్కసారైనా బెండకాయలను వండుతుంటారు. తినడానికి రుచికరంగా ఉండే బెండకాయ ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలిగిస్తుందన్న సంగతి మీకు తెలుసా.. ఆ నిజాలు తెలిస్తే ఇకపై బెండకాయే మీ ఫేవరేట్ వెజిటేబుల్ కావడం ఖాయం. మన శరీరానికి కావాల్సిన ఎన్నో పోషకాలు బెండకాయలో ఉన్నాయి. విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, విటమిన్ కె1 తో పాటు ఫైబర్, పొటాషియం, అయోడిన్ మరియు మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. వాటితో పాటు ఫినోలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్లు ఉన్నాయి. అంతేకాదు బెండకాయలో కేలరీలు, కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. రక్తం గడ్డ కట్టడాన్ని బెండకాయలు నివారిస్తాయి. వీటిని తినడం వలన శరీరంలో ఉన్న చెడు బ్యాక్టీరియా తగ్గి.. మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. అదేవిధంగా కొలెస్ట్రాల్ లెవల్స్ కూడా కంట్రోల్ అవుతాయి. దీని వలన గుండె సంబంధిత సమస్యలకు దూరంగా ఉండొచ్చు. బెండకాయలను తింటే బాడీలో షుగర్ లెవల్స్ సైతం కంట్రోల్ అవుతాయి. ఇందులో ఉండే యాంటీ డయాబెటిక్ లక్షణాలు కార్బోహైడ్రేట్ లను జీవక్రియ ఎంజైమ్ ల పరిమాణాన్ని తగ్గించి.. ఇన్సూలిన్ ఉత్పత్తిని పెంచడానికి దోహదపడుతుందని తెలుస్తోంది. అంతేకాకుండా బెండకాయలను తినడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వలన వ్యాధి కారక క్రిములు, ఇన్ ఫెక్షన్లతో పోరాడే శక్తి లభిస్తుంది. చర్మ సమస్యలు నివారణ కావడంతో పాటు కంటి చూపు మెరుగుపడుతుంది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు గట్టి నిర్ణయం

- **రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని మించరాదు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలన్న తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బకు గురయ్యాయి. సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టంగా చెప్పింది, రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని మించరాదు. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అవసరమైతే పాత రిజర్వేషన్ల విధానాన్ని అనుసరించుకునినే ఎన్నికలు జరగవచ్చని కోర్టు సూచించింది. వివరాల్లోకి వెళితే, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు గతంలో స్టే ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ధర్మాసనం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా నేతృత్వంలో విచారణ జరిపింది. ప్రభుత్వ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. వారు రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే నిర్వహించి శాస్త్రీయంగా రిజర్వేషన్లను పెంచాలని, అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని కోర్టుకు వివరించారు.

అయితే, ప్రతివాదుల వాదన ప్రకారం, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన కృష్ణమూర్తి తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని స్పష్టంగా చెప్పబడిరది. ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టులో కేసు పెండిరగ్‌లో ఉన్నందున, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోలేమని తీర్మానించింది. అయితే, హైకోర్టు ఈ కేసులో విచారణను కొనసాగించాలని సూచన చేసింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై మళ్లీ ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి చర్యలపై చర్చించడానికి త్వరలో జరగనున్న కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.




# పదో తరగతి పాస్ మార్కులు తగ్గించిన కర్ణాటక ప్రభుత్వం

- **35 మార్కులు కాదు.. 33 మార్కులు వస్తే పాస్**
- **విద్యార్థులు చదువుకు దూరం కావొద్దనే నిర్ణయం**
- **కర్ణాటక ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప వెల్లడి**

పదో తరగతి విద్యార్థులకు కర్ణాటక ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పబ్లిక్ పరీక్షలో పాస్ మార్కులు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై ప్రతీ సబ్జెక్ట్ లో 33 మార్కులు తెచ్చుకుంటే పాస్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటీ అరా మార్కులతో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, దీనిని నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని కర్ణాటక మంత్రి మధు బంగారప్ప పేర్కొన్నారు. కిందటేడాది వరకు పదో తరగతిలో పాస్ కావాలంటే ప్రతి సబ్జెక్ట్‌లో తప్పనిసరిగా 35 శాతం మార్కులు తెచ్చుకోవాల్సిందే. ఒకటీ అరా మార్కులతో ఫెయిలైన విద్యార్థి తిరిగి సప్లిమెంటరీ పరీక్షల కోసం వేచి ఉండాలి. ఈ గ్యాప్ లో విద్యార్థులను వారి తల్లిదండ్రులు పనికి పంపించడం, ఆడపిల్లలైతే పెళ్లి చేసి పంపించడం చేస్తున్నారని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి బంగారప్ప చెప్పారు. ఆ తర్వాత పిల్లలు చదువుకు శాశ్వతంగా దూరమవుతున్నారని తెలిపారు. దీనిని తప్పించేందుకు పాస్ మార్కులను 33 కు తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం నుంచే ఈ రూల్ ను అమలు చేస్తామని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు కూడా వర్తిస్తుందని మంత్రి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎస్ఎస్ఎల్‌సీలో 33 శాతం మార్కులు పొందితే ఆ విద్యార్థులు పాస్ అయినట్లే.. ఎస్ఎస్ఎల్‌సీలో మొత్తం మార్కులు 625 కాగా దీనిలో 33 శాతం అనగా 206 మార్కులు వస్తే ఆ విద్యార్థులు ఉత్తీర్ణులవుతారని మంత్రి బంగారప్ప వివరించారు.

# పంజాబ్ పోలీసు హర్‌చరణ్ సింగ్ భుల్లర్ అరెస్టు

- **సీబీఐ ట్రాప్‌లో 5 లక్షల రూపాయల లంచం**

పంజాబ్ పోలీసు రోపర్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ హర్‌చరణ్ సింగ్ భుల్లర్‌ను గురువారం సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండ్‌లో పట్టుకుని అరెస్టు చేశారు. మొహాలీలోని ఆయన ఆఫీసులో జరిగిన ఆపరేషన్‌లో ఆయన నెలవారీ 5 లక్షల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఇదే కేసులో ఒక ప్రైవేటు వ్యాపారవేత్తను కూడా అరెస్టు చేశారు. ఆఫీసు, ఇల్లు, మరో ప్రదేశాల్లో సోదాలు జరిగాయి. ఫతేగర్‌కు చెందిన ఒక స్క్రాప్ డీలర్ (అక్రమ కార్ బిజినెస్‌తో ముడిపడిన వ్యాపారి) ఫిర్యాదు ఆధారంగా చండీగఢ్ సీబీఐ ట్రాప్ వేసింది. భుల్లర్ పోలీసు చర్యలు ఆపడానికి లంచం డిమాండ్ చేశారని ఆరోపణ. ప్రాథమిక చర్యలు: అరెస్టు తర్వాత ఆయన్ను పంచకుల (హర్యానా)కు తీసుకెళ్లి విచారణ చేసి, తిరిగి తీసుకొచ్చారు. సీనియర్ పోలీసు అధికారులు వివరాలు వెల్లడిరచడం లేదు. పంజాబ్ పోలీసు శాఖలో ఈ అరెస్టు సంచలనం సృష్టించింది. భుల్లర్ తండ్రి మాజీ మెహల్ సింగ్ భుల్లర్. భుల్లర్ నేపథ్యం

2024 నవంబర్ 27 నుంచి రోపర్ రేంజ్ (మొహాలీ, రోపర్, ఫతేగర్ సాహిబ్ జిల్లాలు)గా పని చేస్తున్నారు. ముందు పాటియాలా రేంజ్ గా ఉండి, డ్రగ్స్ వ్యతిరేక 'నషా యుద్ధ్' కార్యక్రమంలో కీలక పాత్ర పోషించారు. అకాలీ నేత బిక్రం సింగ్ మంజిత్ డ్రగ్ స్మగ్లింగ్ కేసులో అధిపతిగా నియమితులయ్యారు.





# ప్రతి భారతీయుని శ్రేయస్సు కోసం మోదీ ప్రార్థనలు

- **రూ.13,430 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం**

ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఆంధ్రప్రదేశ్ పర్యటనలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో, మంచి ఆరోగ్యంతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రధాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం క్షేత్రానికి చేరుకున్న ప్రధాని మోదీకి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రధాని వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా విరాజిల్లుతున్న ఈ క్షేత్రం యొక్క విశిష్టతను, చారిత్రక ప్రాముఖ్యతను అర్చకులు ప్రధానికి వివరించారు. అనంతరం ప్రధాని తన పర్యటనకు సంబంధించిన ఫోటోలను 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. ఈ పర్యటనతో శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న నాలుగో భారత ప్రధానిగా నరేంద్ర మోదీ నిలిచారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు ఈ ఆలయాన్ని సందర్శించారు. ప్రధానిగా మోదీ శ్రీశైలానికి రావడం ఇదే తొలిసారి.

ఆలయ దర్శనం తర్వాత ప్రధాని మోదీ శ్రీశైలంలో ఉన్న శ్రీ శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. 1677లో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఈ క్షేత్రాన్ని సందర్శించిన దానికి గుర్తుగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి ధ్యాన మందిరాన్ని, శివాజీ విగ్రహాన్ని ప్రధాని పరిశీలించారు. కేంద్రం నిర్వాహకులు దాని ప్రాముఖ్యతను మోదీకి వివరించారు. అంతకుముందు కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానికి గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు.

ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ రాష్ట్రంలో పరిశ్రమలు, విద్యుత్, రోడ్లు, రైల్వేలు, రక్షణ, పెట్రోలియం వంటి పలు రంగాలకు చెందిన సుమారు రూ.13,430 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. నన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జీఎస్టీ సంస్కరణలపై జరిగే బహిరంగ సభలో కూడా ఆయన ప్రసంగించనున్నారు.





# ఆరు నెలల తర్వాత వీడిన వైద్యురాలి మృతి మిస్టరీ

- **డాక్టర్ భార్య మృతి కేసులో భర్త అయిన మరో డాక్టర్ అరెస్ట్**
- **ఆరు నెలల కిందట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు**
- **మణిపాల్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న బెంగళూరు పోలీసులు**



వైద్య వృత్తిని అడ్డం పెట్టుకుని, కట్టుకున్న భార్యను హతమార్చిన ఓ వైద్యుడి కిరాతకం బెంగళూరులో వెలుగులోకి వచ్చింది. అనారోగ్యంతో చనిపోయిందని అందరినీ నమ్మించినా, ఆరు నెలల తర్వాత ఫోరెన్సిక్ నివేదిక అసలు నిజాన్ని బయటపెట్టడంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ మహేంద్ర రెడ్డి, డెర్మటాలజిస్ట్ అయిన డాక్టర్ కృతిక రెడ్డి భార్యాభర్తలు. వీరికి గత ఏడాది మే 26న వివాహం జరిగింది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ 21న మున్నెకొల్లాల్‌లోని వారి నివాసంలో కృతిక అస్వస్థతకు గురయ్యారని చెబుతూ ఆమె భర్త మహేంద్ర రెడ్డే దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మరాఠహళ్లి పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలంలో క్రైమ్ ఆఫీసర్లు తనిఖీ చేయగా, ఓ కానిలా సెట్, ఇంజెక్షన్ ట్యూబ్ వంటి వైద్య పరికరాలు లభించాయి. వాటిని ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపించారు. మృతురాలి అంతర్గత అవయవాల నమూనాలను కూడా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఎఫ్ఎస్ఎల్ నివేదికలో కృతిక శరీరంలో 'ప్రోపోఫాల్' అనే శక్తిమంతమైన అనస్థీషియా (మత్తు) మందు ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో ఇది హత్యేనని నిర్ధారణ కావడంతో మృతురాలి తండ్రి అక్టోబర్ 13న తన అల్లుడే మత్తుమందు ఇచ్చి కూతురిని చంపాడని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వేగంగా స్పందించి, అక్టోబర్ 14న కర్ణాటకలోని మణిపాల్‌లో ఉన్న నిందితుడు మహేంద్ర రెడ్డిని అరెస్ట్ చేశారు.

ఈ ఘటనపై బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ''భార్యను ఆసుపత్రికి తీసుకొచ్చిన భర్త, ఆమెకు మత్తు మందు ఇచ్చిన విషయాన్ని దాచిపెట్టాడు. ఆమె ఆరోగ్యం బాగోలేదని మాత్రమే చెప్పాడు. ఇప్పుడు ఆమె శరీరంలో మత్తుమందు ఆనవాళ్లు బయటపడటంతో, ఇందులో దురుద్దేశం ఉన్నట్లు స్పష్టమైంది. ఈ కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నాం'' అని తెలిపారు. ప్రస్తుతం నిందితుడు పోలీస్ కస్టడీలో ఉన్నాడు. వైద్య పరిజ్ఞానాన్ని ఉపయోగించి హత్యను సహజ మరణంగా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన వైద్య వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# రష్యా చమురు కొనుగోళ్లపై ట్రంప్ వ్యాఖ్యలకు భారత్ కౌంటర్

- **దేశీయ ప్రయోజనాలే ప్రాధాన్యం**
- **ట్రంప్ వ్యాఖ్యల తర్వాత భారత్ రియాక్షన్**
- **దేశీయ అవసరాలకే ఆధారంగా నిర్ణయాలు**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు దేశీయ మరియు అంతర్జాతీయ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ''రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ ఆపేస్తుందని ప్రధాని మోదీ నాకు హామీ ఇచ్చారు. ఇది వెంటనే జరగకపోయినా, ఆ ప్రక్రియ త్వరలోనే ముగుస్తుంది'' అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం వెంటనే స్పందించింది. విదేశాంగ శాఖ స్పష్టంగా తెలిపింది, ''భారతీయ వినియోగదారుల ప్రయోజనాలు, ఇంధన భద్రత మరియు ధరల స్థిరత్వం ప్రధాన లక్ష్యాలు.'' భారత్ లో ఇంధన దిగుమతులు, చమురు కొనుగోళ్ల విషయంలో తీసుకునే నిర్ణయాలు పూర్తిగా దేశీయ అవసరాల మేరకే ఉంటాయని విదేశాంగ శాఖ పేర్కొంది. ''మా ఇంధన విధానాలు భారతీయ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటానికి పూర్తిగా సమ్మతంగా ఉంటాయి. సరఫరా లోపాలు, ధరల అస్థిరతలను తగ్గించడం మా ప్రథమ లక్ష్యం'' అని అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరించారు.

**ఇంధన భద్రత మరియు ధరల స్థిరత్వం**

భారత ప్రభుత్వం ఇంధన సరఫరా భద్రతను పెంచడంలో, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వనరులను విస్తరించడంలో కీలకమైన దృష్టిని పెట్టుతోంది. స్థానిక వినియోగదారుల ఇంధన ధరలు స్థిరంగా ఉండటం, సరఫరా వ్యవస్థలో ఒడిదొడుకులు రాకుండా చూసుకోవడం ప్రధాన లక్ష్యాలు. ఈ విధానం భారత్ అంతర్జాతీయ ఇంధన మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిరది.

భారత్‌అమెరికా ఇంధన సంబంధాలు గత కొన్ని దశాబ్దాలుగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం, అమెరికా భారతదేశంతో ఇంధన సహకారాన్ని మరింత బలపరచడానికి ఆసక్తి చూపిస్తోంది. భారత ప్రభుత్వం కూడా ఆ దేశంతో ఇంధన సహకార, సరఫరా, మరియు ధరల స్థిరత్వంపై చర్చలను కొనసాగిస్తోంది. ఈ వ్యవహారాలు రెండు దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను మరింత సమర్థవంతంగా తయారుచేస్తున్నాయి. ఈ విధంగా, భారత్ స్పష్టంగా తెలియజేసింది దేశీయ వినియోగదారుల ప్రయోజనాలు, ఇంధన భద్రత, మరియు ధరల స్థిరత్వమే ప్రథమ ప్రాధాన్యత, అంతర్జాతీయ ఒత్తిళ్లను దృష్టిలో పెట్టుకుని మాత్రమే ఇంధన విధానాలు రూపుదిద్దబడతాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in